



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 139 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-





## విద్యుత్ ఛార్జీల భారం పడనివ్వం...

# ప్రజలకే ట్రూ డౌన్ ఫలితాలు

**ఆర్టీసీలో 1,000 ఈవీ బస్సుల కొనుగోలు - కీలక శాఖల్లో నిబంధనలు సరళతరంపై దృష్టి పెట్టండి**

**పన్నుల వసూళ్లు తగ్గకూడదు... వ్యాపారులను వేధించకూడదు - కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి**

**మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి స్పష్టం చేశారు. ట్రూ డౌన్ ఫలితాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ కొనుగోలు భారాన్ని కూడా తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయంలో ఏఐ సాంకేతికత, విద్యుత్, విత్తన నిర్వహణ, డ్రోన్లు, యాంత్రీకరణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పాలసీలు, పథకాల అమలుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... "వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, మెరుగైన ధరలు లభించేందుకు ఉన్న అవకాశాలపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉండాలి. గ్లోబల్ మార్కెట్ ఉండే పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. రాయలసీమను ఉద్యాన రంగంలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు పెట్టుబడులపైనా దృష్టి పెట్టాలి. ప్రస్తుతం రాయలసీమ నుంచే 220 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది... త్వరలోనే 400 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకూ 4 లేన్ రైల్వే లైన్ వస్తోంది... స్పీడ్ ట్రైన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే సాకారమవుతుంది. నెట్ జీరో ఎమిషన్ కాన్సెప్టుతో విద్యుత్ ఉత్పాదన జరగాలి. పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులు వేగంగా చేపట్టాలి. రూ.3.90కే విద్యుత్ కొనుగోలు ధర మిగతా .. 2లో..

## మద్యం కుంభకోణం కేసు..

# రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా హయాంలో జరిగిన ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఆయన బెయిల్ వ్యవహారంలో జోక్యం చేసుకోలేమనితెలిపింది. ఈ కేసులో ఏపీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో రాజ్ కెసిరెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజ్ కెసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు ప్రారంభించగానే ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని మిగతా .. 2లో..

## అధికారులు ఉదాసీనంగా

# వ్యవహరించవద్దు

**డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** క్షేత్రస్థాయిలో అధికా రులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని చెప్పారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ పాల్గొని మాట్లాడారు. తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని పవన్ అన్నారు. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు. అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవి తల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వివిధ పథకాలకు రూ.11,328 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌కు రూ.25వేల కోట్ల మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.10వేల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని పవన్ తెలిపారు.

# ఏపీలో ఎండలు మొదలయ్యాయ్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. శీతకాలం పూర్తి కాకముందే భానుడు మండిపోతున్నాడు. ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా కావలిలో గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదైంది. నరసాపురం, బాపట్ల, ఒంగోలు, కావలి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీలు పెరిగాయి. రాబోయే రెండురోజుల్లో దక్షిణ కోస్తాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఉత్తర కోస్తా, యానాంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు మిగతా .. 2లో..

## అంబటి రాంబాబుకు

# 14 రోజుల రిమాండ్

**గుంటూరు కోర్టు ఆదేశాలు - పలు కేసుల్లో విచారణ కొనసాగింపు**




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు గుంటూరు కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. వివిధ కేసుల్లో అరెస్టయిన అంబటి రాంబాబును సోమవారం రాజమండ్రి జైలు నుంచి గుంటూరు కోర్టుకు తరలించారు. వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతి రేకంగా వైసీపీ నిర్వహించిన ఆందోళనలో అంబటి రాంబాబు పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఘటనకు సంబంధించి ఆయనపై పీటీ వారెంట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో గుంటూరు స్పెషల్ జ్యుడీషియల్ మిగతా .. 2లో..

## శ్రీశైలంలో శివదీక్ష

# భక్తుల నిరసన




**శ్రీశైలం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఆలయం వద్ద శివదీక్ష భక్తులు నిరసనకు దిగారు. స్పర్శ దర్శనానికి ఆలస్యమవుతోందని ఆరోపించారు. ఆలయ పరిధిలోని కృష్ణదేవరాయ క్యూలైన్లు విరగ్గొట్టి చొచ్చుకెళ్లారు. కృష్ణదేవరాయ గోపురం నుంచి మిగతా .. 2లో..

## మున్సిపల్ ఎన్నికలకు..

# మోదీకి ఏం సంబంధం?

**తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోరు నెలకొందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తును ఆలోచించుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. 12 ఏళ్లుగా కేంద్రంలో ఉన్న భాజపా.. తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా? అని ప్రశ్నించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోదీనే స్వయంగా హామీ ఇచ్చారు. వాటి గురించి చెప్పట్లేదు.. కానీ, మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. వరదల్లో నీటమునిగిన వస్తువులన్నీ కేంద్రం నుంచి నిధులు తెచ్చి తిరిగిస్తామని గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బండి సంజయ్ మిగతా .. 2లో..

## మడకశిరలో

# చిరుత సంచారం

**గ్రామస్థుల ఆందోళన**



**మడకశిర, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలో పెద్దపులి ఘటన మరవకముందే.. శ్రీసత్యసాయి జిల్లాలో చిరుత కలకలం సృష్టిస్తోంది. మడకశిర మండలం ఎల్లోటి గ్రామ పరిసరాల్లో చిరుత సంచారంతో గ్రామస్థులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఓ పొలం వద్ద చిరుత వేటాడిన జింక కళేబరం కనిపించింది. వెంటనే ఓ రైతు.. అటవీ శాఖ అధికారులకు ఈమేరకు సమాచారం అందించారు. దీంతో వారు ఆ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి చిరుత ఆనవాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం జింక కళేబరాన్ని దహనం చేశారు. ఎల్లోటి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని అటవీ మిగతా .. 2లో..

## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..

# ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దు

**సుప్రీంకోర్టు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' కసరత్తు ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని పేర్కొంది. అంతేకానీ సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ మిగతా .. 2లో..

# మచిలీపట్నం పోర్టు రూపురేఖలు మారబోతున్నాయి : ఎంపీ బాలశౌరి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మచిలీపట్నంలో నౌకానిర్మాణం, మరమ్మతుల కోసం ఏపీ మారిటైమ్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎంపీ బాలశౌరి తెలిపారు. దీంతో మచిలీపట్నం పోర్టు రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. షిప్‌బిల్డింగ్, రిపేర్ సౌకర్యాల ఏర్పాటు కోసం జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్లకు బందరు వాసుల కల నెరవేరనుందని తెలిపారు. అనుమతులు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.

# స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలు మిగతా .. 2లో..

## ఫీజులు పెంచినా విదేశీ టాలెంట్ కావాల్సిందే..

# ఏఐతో 'హెచ్-1బీ'కి డిమాండ్..




**విశ్వం వాయిస్ న్యూస్ :** టెక్ కంపెనీల విదేశీ నియామకాలను తగ్గించేందుకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను ట్రంప్ సర్కారు కఠిన తరం చేసింది. ఈ వీసాలకు ఏకంగా లక్ష డాలర్ల ఫీజును నిర్ణయించింది. అయినప్పటికీ.. టెక్ కంపెనీలు మాత్రం ఈ వీసాదారుల వైపే మొగ్గుచూపుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు.. ఆ లక్ష్యాల సాధన కోసం పెద్ద సంఖ్యలో విదేశీ టాలెంట్‌ను నమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే 'హెచ్-1బీ' వీసాలకు డిమాండ్ పెరుగుతున్నట్లు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజలకే ట్రూ డౌన్ ఫలితాలు

తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్టీసీలో కనీసం వెయ్యి బస్సులను ఈవీగా మార్చాల్సిన అవసరం ఉంది. కుప్పంలో ఇటీవల ఓ 5 వేల పైచిలుకు ఇ-సైకిళ్లు పంపిణీ చేశాం... ఈ తరహా విధానాల వల్ల వేగంగా ట్రాన్సిషన్ జరుగుతుంది. గతంలో ఏపీలో నీరు, విద్యుత్ విషయంలో లోటు ఉండేది. ఇప్పుడు మిగులు పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక మీటరు వరకు భూగర్భ జలాలను పెంచటం ద్వారా దాదాపు రూ.4 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతుంది." అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**నిబంధనలు తగ్గాలి... పాలన సులభం కావాలి**

"చిన్న రైస్ మిల్లు పెట్టడానికి 30కు పైగా అనుమతులు కావాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి పోవాలి. చిన్నపాటి వ్యాపారం ప్రారంభించడానికి 30 చోట్లకు తిరగడం కష్టసాధ్యమైన అంశం. మరోవైపు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతున్నాం... వివిధ కీలక శాఖల్లో నిబంధనలను సరళతరం చేయాలి. అగ్నిమాపక, పురపాలక, అటవీ, స్కూల్ ఎడ్యుకేషన్ ఇలా వేర్వేరు శాఖల్లో నిబంధనలను మరింత సడలించాలి. నిర్దేశిత కాలపరిమితి ముగిసిన తర్వాత చట్టాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కరణల్లో ముందుండాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఎలాంటి ఆటంకమూ రాకూడదు. శాండ్, మైన్ తదితర అంశాల్లో నిబంధనలు సులభంగా ఉండాలి... సింగిల్ విండో విధానం అనుసరించాలి. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ కూడా రానీయకుండా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధికారుల నుంచి ఇబ్బందులు వస్తున్నాయనే ఫిర్యాదులు ఇంకా వస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా మెటీరియల్ సరఫరాకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలను అందుబాటులోకి తేవాలి. వీటి గురించి చాలా కాలంగా మాట్లాడుతున్నాం... దేవదాయం వంటి శాఖలు ఇంకా గాడిలో పడాల్సి ఉంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా పనులు పూర్తి చేసుకోగలిగేలా చేయడమే సుపరిపాలన. ఆ దిశగా అందరూ కృషి చేయాలి.. అందరూ భాగస్వాములు కావాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**కేంద్ర నిధులు మురిగిపోతే అధికారులనే బాధ్యులుగా చేస్తాం**

"ప్రొడెక్ట్ పర్ఫెక్షన్‌పై దృష్టి పెట్టాలి... నాణ్యమైన ఉత్పత్తులు వస్తేనే ఎక్కువ మార్కెట్ సాధ్యం అవుతుంది. స్వయం సహాయ సంఘాలకు కూడా స్వయం అనే పేరిట బ్రాండ్ రూపొందించాం. ఈ బ్రాండ్ ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండింగ్ రావాలి. ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండ్ ఇమేజ్ ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. నగర ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణం కోసం అవసరమైన మేరకు భూసేకరణ చేపట్టాలి... దీనికి అవసరమైన నిధులను పీసీబీ సమకూరుస్తుంది. రూ.300 కోట్ల వ్యయంతో ఎస్టీపీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో లెగసీ వేస్ట్‌ను వేగంగా క్లియర్ చేయాలి. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంగా ప్రణాళికలు చేయాలి. ఉగాది నుంచి పాఠశాలల్లో గ్రీన్ కవర్ కోసం దేశీయ వృక్ష జాతుల పెంపకంపై కార్యాచరణ రూపొందించాలి. గ్రీన్ కవర్ పెంచే విషయంలో విద్యార్థులను భాగస్వాములను చేయటం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. తీర ప్రాంతంలో కోత నివారణకు ఉప ముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టు అభినందనీయం. తీర ప్రాంతంలో ఆర్కిడ్స్ సాగు ద్వారా రైతులకు ఆదాయం, కోత నివారణ సాధ్యం అవుతుంది. పన్నులను పూర్తి స్థాయిలో వసూళ్లు చేయాలి... అలాగని వ్యాపారులను వేధించి వసూలు చేయవద్దు... రాష్ట్ర ఖజానాకు నష్టం రాకూడదు. రిజిస్ట్రేషన్ విభాగంలో ఈ ఏడాది రూ.9,103 కోట్లతో 27 శాతం మేర వృద్ధి నమోదైంది. ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, పురపాలక శాఖ ఇలా విభాగాలు అన్నీ సమర్థంగా పని చేయాలి. అటవీ శాఖ దగ్గర ఉన్న ఎర్ర చందనం విక్రయించి ఆదాయం ఆర్జించాల్సిన అవసరం ఉంది. ఎర్ర చందనం విక్రయం ద్వారా కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అంచనా వేశాం. ప్రభుత్వ శాఖలన్నీ కేంద్ర పథకాల ద్వారా వచ్చిన నిధుల్ని తక్షణం ఖర్చు చేయాలి. అన్ క్లెయిమ్డ్ డిపాజిట్ల విషయంలో జిల్లా కలెక్టర్లు తక్షణం కేవైసీ చేపట్టాలి. 1,04,727 పీడీ ఖాతాల్లో ఉన్న అన్ క్లైమ్డ్ డిపాజిట్ల విలువ రూ.148 కోట్లుగా ఉన్నాయి... వీటిని జిల్లా కలెక్టర్లు వినియోగించుకోవచ్చు. 1,04,727 పీడీ ఖాతాలకు కేవైసీ సమర్పించాల్సి ఉండగా... రూ.34 కోట్ల అన్ క్లైమ్డ్ డిపాజిట్లకు చెందిన కేవలం 7,742 ఖాతాలకు మాత్రమే జిల్లా కలెక్టర్లు కేవైసీ చేయించారు. సంస్కరణల ప్రాతిపదికన సాస్కీ కింద ప్రాజెక్టుల నిధులు త్వరితగతిన వచ్చేలా చూడాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.26,021 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశాం." అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

# స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం..?

నోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి. మరోవైపు, పార్లమెంట్‌లో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి.

# ఏఐతో 'హెచ్-1బీ'కి డిమాండ్..

నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ నివేదిక వెల్లడించింది. ఇమిగ్రేషన్ డేటాను అధ్యయనం చేసి ఎన్ఎఫ్ఏపీ ఈ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో కొత్త హెచ్-1బీ వీసాల జారీ కోసం టెక్ కంపెనీలు సమర్పించిన లేబర్ కండీషన్స్ అప్లికేషన్స్‌లో 80శాతానికి పైగా ఏఐ సంబంధిత నియామకాలవేనని నివేదిక తెలిపింది. అత్యధికంగా అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీలు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో అమెజాన్ అత్యధికంగా 4,644 మంది హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంది. సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సైంటిస్టులు, డేటా సైంటిస్టుల విధుల కోసం కంపెనీలు ఈ వీసాదారులను ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. అధునాతన ఏఐ సాంకేతికతలో అమెరికన్లకు నైపుణ్యాల కొరత వల్లే కంపెనీలు విదేశీ టాలెంట్‌పై ఆధారపడుతున్నట్లు ఎన్ఎఫ్ఏపీ నివేదిక తెలిపింది. అమెరికా వర్సిటీల్లో కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ చదువుతున్న విద్యార్థుల్లో 80శాతం మంది విదేశీయులే. ఇక, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో 75శాతం మంది విదేశీ విద్యార్థులున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఈ గ్రాడ్యుయేట్లు కొంత కాలం పాటు కింద పనిచేయవచ్చు. ఆ వ్యవధి తరువాత వారిని కంపెనీలు తీసుకోవాలంటే హెచ్-1బీ వీసా ఒక్కటే మార్గం. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ కంపెనీలు ప్రస్తుతం కృత్రిమ మేధపై భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. 2025లో ఈ ఐదు కంపెనీలు 380 బిలియన్ డాలర్లకు పైగా ఏఐపై వెచ్చించాయి. రానున్న కాలంలోనూ ఈ రంగంపై భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాల లక్ష్యాల కోసం హెచ్-1బీ వీసా ఫీజులను భరించి నియామకాలు చేపట్టేందుకు కంపెనీలు మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దు

ప్రక్రియ(సర్) కోసం 300మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

# రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా రాజ్ కెసిరెడ్డి ఉన్నారని.. ఆయనకు రెగ్యులర్ బెయిల్ ఎలా సాధ్యమని ప్రశ్నించింది. హైకోర్టు అన్నీ పరిశీలించాకే బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా నాగముత్తు వాదనలు కొనసాగించగా.. ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. "ఈ కేసులో ప్రధాన కుట్రకు రాజ్ కెసిరెడ్డి కేంద్ర బిందువుగా ఉన్నట్లు మాకు అనిపిస్తోంది. ఈ దశలో మేం జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదు. ఆయనకు బెయిల్ ఇస్తే దాని ప్రభావం కేసుపై తీవ్రంగా ఉంటుంది. ఈ కేసులో ఇప్పటివరకు తేలిన లెక్కల ప్రకారం రూ.750 కోట్లు డిపాజిట్ చేసిన షెల్ కంపెనీలతో కెసిరెడ్డికి నేరుగా సంబంధాలున్నట్లు కనిపిస్తోంది" అని ధర్మాసనం పేర్కొంది. 9 నెలలుగా రాజ్ కెసిరెడ్డి జైలులో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.700 కోట్లకు పైగా అక్రమాలు చోటు చేసుకున్న వ్యవహారంలో 9 నెలలు జైలులో ఉండటం ఎక్కువేమీ కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలు కోర్టు ముందు ఉంచేందుకు న్యాయవాది సమయం కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

# ఏపీలో ఎండలు మొదలయ్యాయ్

సాధారణం కంటే 2-3 డిగ్రీలు ఎక్కువగా, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని అంచనా వేస్తోంది. రాయలసీమలో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-4 డిగ్రీలు తగ్గొచ్చని తెలిపింది. సోమవారం రాష్ట్రంలో కొన్నిచోట్ల పొగమంచు కురుస్తుందని అంచనా.

# మడకశిరలో చిరుత సంచారం

ప్రాంతంలో కొన్ని రోజుల క్రితం మేక, కుక్కపై చిరుత దాడి చేసి చంపింది. ఇప్పుడు జింక కళేబరం లభ్యం కావడం ఆందోళన కలిగిస్తోందని స్థానికులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి హాని జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# 14 రోజుల రిమాండ్

మెజిస్ట్రేట్ కోర్టు ముందు ఆయనను హాజరుపరిచారు. ఇదే కాకుండా తిరుమల లడ్డూ వ్యవహారంలో నిర్వహించిన నిరసన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అసభ్య వ్యాఖ్యలు చేసినట్లు టీడీపీ నాయకులు అంబటి రాంబాబుపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో కూడా గుంటూరు కోర్టులో సోమవారం విచారణ జరిగింది. అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు జైలులో అదనపు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ కొనసాగించింది. అన్ని వాదనలు విన్న అనంతరం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ అనంతరం అంబటి రాంబాబును తిరిగి రాజమండ్రి జైలుకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

# శ్రీశైలంలో శివదీక్ష భక్తుల నిరసన

వందలాదిగా దూసుకొచ్చారు. పుష్కరిణి వైపు గేట్లు ఎక్కి ఆలయంలోకి వస్తున్నారు. శివదీక్ష భక్తులను కట్టడి చేయలేక ఆలయ భద్రతా సిబ్బంది, పోలీసులు చేతులెత్తేశారు. పుష్కరిణి వైపు పోలీసు బందోబస్తు, తగిన ఏర్పాట్లను అధికారులు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

# మోదీకి ఏం సంబంధం?

హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మి ఆ పార్టీకి చెందిన 50 మందిని కార్పొరేటర్లుగా గెలిపించారు. ఎన్నికలయ్యాక అడిగితే.. వస్తువులకు బీమా ఉంటుందని బండి సంజయ్ మాటమార్చారు.

**దక్షిణాదికి తీవ్ర అన్యాయం**

తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని భాజపా నేతలు చెబుతున్నారు. దీనిపై సీఎస్‌ను వివరణ అడిగితే.. మనం రూపాయి చెల్లిస్తే.. కేంద్రం 42 పైసలు ఇస్తోందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు భాజపా తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే.. రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీకండక్టర్ ప్రాజెక్టును మోదీ ఒత్తిడి చేసి.. ఏపీకి తరలించారు. ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధం? భాజపా నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ. ఆయన పేరు లేకుండా ఆ నేతల ప్రచారం ఉండదు. మత రాజకీయాల ద్వారా భాజపా రాజకీయ మనుగడ సాగిస్తోంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- వేసవిలో నీటి ఎద్దడి ఉండకూడదు... ముందస్తు చర్యలు తీసుకోవాలి
- హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
- పోషకాహారం పెంచేలా పాఠశాలలు, అంగన్వాడీల్లో మధ్యాహ్న భోజనం
- త్వరలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలి
- గత పాలకుల తప్పిదాల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నాం
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రులు, కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతుందోననే అంశంపై ప్రత్యక్షంగా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా... క్షేత్ర స్థాయిలో పాలసీలు అమలుకానప్పుడు ఫలితం ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. వారి వారి శాఖల పనితీరు ఎలా ఉందన్న అంశంపై పరిశీలించడానికి తరుచూ ఫీల్డ్ విజిట్స్ చేపట్టాలని సీఎం సూచించారు. వివిధ వర్గాల ప్రజలతో అధికారులు తరుచూ మాట్లాడుతూ ఉంటే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాకులో జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ అంశాలపై ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'ప్రతీ ఐదేళ్లకూ జీఎస్డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలి. తలసరి ఆదాయం ప్రజల జీవన ప్రమాణాలకు ప్రతీకగా నిలుస్తుంది. కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల విషయంలో జాగ్రత్తగా అంచనాలు వేయాలి. క్షేత్రస్థాయి నుంచి తీసుకునే సమాచారం ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకోవాలి. పీ4 అనేది రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమం. మార్గదర్శులు బంగారు మిత్రలను నియమించుకోవాలి... వారి ద్వారా ఆయా పేద కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలి. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాల రీషెడ్యూలు చేస్తున్నాం. 2019-24 మధ్య ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీశారు. జీతాలు కూడా మొదటి తేదీకి ఇవ్వలేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు జీతాల చెల్లింపులను గాడిలో పెట్టాం... సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం. అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న కొన్ని జిల్లాల్లో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోంది. అలాగే భవిష్యత్తులో ఆ జిల్లాలు లైమ్ లైట్లోకి వచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు ఉత్పత్తికి అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటి వరకు కశ్మీర్ లో మాత్రమే కుంకుమ పువ్వు ఉత్పత్తి జరుగుతోంది. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటు అవుతుంది. కాఫీ సాగు పెంచటంతో పాటు అరకు కాఫీ బ్రాండ్ ప్రమోట్ చేస్తున్నాం.. ఇది మరింతగా పెరగాలి"అని సీఎం చంద్రబాబు వివరించారు.

**నార్మల్ డెలివరీలు పెరిగేలా అవగాహన కల్పించండి**

"సంజీవని ద్వారా జూలై 2026 నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల స్క్రీనింగ్ చేపట్టాలి. 12వ తరగతి వరకూ ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, పెరుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారం అందించటంతో పాటు అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు. అవిశ, మునగ, రకరకాల ఆకు కూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. పూర్వ కాలంలో మనం రోజూ తినే ఆహారంలోనే పోషకాహారాలు ఉండేవి. రాను రాను వాటిని ఆహారంగా తీసుకోవడం మానేయడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలలోనూ పౌష్టికాహారాన్ని అందించేలా కార్యాచరణ ఉండాలి. వీలుంటే అన్న క్యాంటీన్లల్లో కూడా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక డెలివరిల విషయంలో నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి... సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. ఈ మేరకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన ఓ కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. జనాభా విషయంలో చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య బాగా పెరిగిపోయింది. యూరోప్ లోని దాదాపు 20 దేశాల్లో ఏజింగ్ సమస్యతో.. ఒంటరిగా తయారైంది. సామాజిక వేడుకలే లేవు" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ఒత్తిడి లేని విద్యాబోధనే లక్ష్యంగా...**

"పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేలా ఈ కార్యాచరణలో భాగం చేయాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలు వస్తాయి... ఇన్నోవేషన్లకు ఆస్కారం ఉంటుంది. విద్యా వ్యవస్థలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు అధిక ప్రాధాన్యతనివ్వాలి. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. నైపుణ్యాలు పెంచే అంశంపై కొత్తగా ఆలోచనలు చేయాలి. లేటరల్ ఎంట్రీ ఉండేలా యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో చర్యలు చేపట్టాలి. ఓ ఎలక్ట్రీషియన్ , ఓ కార్పెంటర్ వంటి వారు ఉన్నత విద్యను అభ్యసించి సర్టిఫికెట్లను పొందేలా కార్యాచరణ ఉండాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. నైపుణ్య కల్పనలో భాగంగా ఐటీఐలు, కళాశాలల్లో కాన్వొకేషన్లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలి. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ ద్వారా ప్రైవేటు సంస్థలు యువతకు నైపుణ్యాలను కల్పించే అంశంపై దృష్టి పెట్టాలి. వివిధ రంగాల్లో దేశంలో ఎక్కడున్నామనే అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్ తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్నీ పర్యవేక్షించాలి. నైపుణ్యాభివృద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేయాలి. నిధులను కూడా ఇంటిగ్రేట్ చేసుకోవాలి. రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి. చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. దీంతో పాటు డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్ లను తవ్వాలి, నిల్వలు పెరిగేలా చూడాలి ప్రస్తుతం 7.34 భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భ నీటి నిల్వలు పెరిగితే పర్యావరణ పరంగా మంచిది. విద్యుత్ కూడా ఆదా అవుతుంది. నీటి బ్యాంకు తరహాలో భూగర్భ జలాలు వినియోగం జరగాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలం" అని సీఎం వివరించారు.

**జీ రామ్ జీ పనులపై కార్యాచరణ సిద్ధం చేయాలి**

"పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. బోర్ల నుంచి కలుషితమైన నీరు రావటానికి వీల్లేకుండా చూడాలి. ఆశ్రమ బాలుర హాస్టల్ లో కలుషిత నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంఛార్జీ మంత్రులదే బాధ్యత. వేసవి రాబోతోంది. నీటి ఎద్దడి అనేది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి. తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూసుకోవడంతోపాటు... పశువుల దాణాకూ ఇబ్బందులు రాకూడదు. పంచాయితీరాజ్ రోడ్లు, నీటి సంరక్షణా చర్యలు, గోకుల షెడ్లు, మేజిక్ డ్రెయిన్లు చేపట్టాలి"అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# తిరుపతి లడ్డూ ఇష్యూ - అమిత్ షాకి బ్రీఫింగ్?

కేంద్ర హోం మంత్రిగా అత్యంత శక్తివంతమైన ప్రభుత్వ అధినేతగా అమిత్ షా జాతీయ స్థాయిలో కనిపిస్తారు. ఆయన బీజేపీకి కానీ ఎన్డీయే ప్రభుత్వానికి కానీ పవర్ ఫుల్ లీడర్ గా ఉంటున్న సంగతి తెలిసిందే. అటు పార్టీ పరంగా కానీ ఇటు ప్రభుత్వం పరంగా కానీ ఆయన కనుసన్నలలోనే అంతా జరుగుతుందని ప్రచారంలో ఉన్న మాట. ఇదిలా ఉంటే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి పొద్దు పోయాక ఏపీ నుంచి ఢిల్లీకి చేరుకున్నారు. బాబుకు ఎయిర్ పోర్టులో టీడీపీ ఎంపీలు అంతా ఘన స్వాగతం పలికారు. అనంతరం బాబు ఎంపీలతో కీలక సమావేశం నిర్వహించి పార్లమెంట్ బడ్జెట్ సెషన్ గురించి ఇతర విషయాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వన్ జన్ పథ్ లోని తన నివాసానికి చేరుకున్నారు.

**అమిత్ షాతో చర్చించేది ఇదే :**

ఇక బాబు మంగళవారం కేంద్ర మంత్రి అమిత్ షాను కలవబోతున్నారు. ఆయనతో ప్రధానంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు తిరుపతి లడ్డూ ఇష్యూని కూడా వివరిస్తారు అని అంటున్నారు. సీబీఐ ఆధ్వర్యంలో వచ్చిన రిపోర్టు గురించి చర్చిస్తారు అని అంటున్నారు. ఏపీలో వర్తమాన రాజకీయ పరిణామాలను గురించి ఆయన వివరిస్తారు అని అంటున్నారు. ఏపీలో లడ్డూ ఇష్యూలో చోటు చేసుకున్న పరిణామాలు వాటి పర్యవసానాలు కేంద్ర హోం మంత్రి దృష్టిలో పెడతారు అని అంటున్నారు.

కేంద్రం ఫోకస్ ఉంటుందా : సీబీఐ అంటే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే సంస్థ. ఇక సీబీఐని తిరుపతి లడ్డూ విషయంలో విచారణకు నియమించింది సుప్రీం కోర్టు. నివేదిక ఇచ్చారు. దాంతో కేంద్ర ప్రభుత్వం దీని మీద ఏమి చేస్తుంది అన్నది కూడా చర్చగా ఉంది. మరో వైపు రాజకీయంగా చూస్తే టీడీపీ బీజేపీ జనసేన మిత్రులుగా ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఈ మూడు పార్టీలకు ప్రత్యర్థిగా రాజకీయంగా వైసీపీ ఉంది. దాంతో ఏపీలో మూడు పార్టీలను సమాయత్తపరచి వైసీపీ మీద విమర్శలు ఎక్కుపెట్టేలా టీడీపీ వ్యూహరచన చేసింది. అదే సమయంలో వీలైనంతగా కేంద్ర సాయం కూడా కావాలని అక్కడ బీజేపీ పెద్దలు కూడా సహకరిస్తే లడ్డూ ఇష్యూలో వైసీపీ చేసిన తప్పులను మరింతగా ఎక్స్ పోజ్ చేయవచ్చు అన్నది టీడీపీ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. సానుకూలమేనా : ఇక ఏపీలో టీడీపీకి అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తున్న కేంద్ర బీజేపీ పెద్దలు ఈ ఇష్యూలో కలిసికట్టుగా ముందుకు సాగేందుకు అవసరమైన సలహా సూచనలు ఇస్తారని కూడా అంటున్నారు. అదే సమయంలో ఏపీలో వైసీపీని



బలంగా ఎదుర్కోవడానికి అవసరమైన వ్యూహరచనకు ఏపీ బీజేపీ నేతలతో ముందుకు సాగేందుకు తగిన విధంగా దిశా నిర్దేశం చేయవచ్చు అన్న ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




# ఏంటి మాస్టారూ.. ఇలా 'చిక్కి'పోయారు?

**తునిలో ఏటీఎం చోరీకి యత్నించి.. దొరికిన ఝార్ఖండ్ వాసి**

**ఏటీఎం యంత్రాన్ని రాయితో పగులగొడుతున్న నిందితుడు**



**తుని, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం అర్ధరాత్రి 12.40 గంటల సమయం. కాకినాడ జిల్లా తుని పట్టణం జీఎన్‌టీ రోడ్డులోని రామా థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి ఓ వ్యక్తి ప్రవేశించాడు. ఆ యంత్రాన్ని రాయితో పగులగొట్టే ప్రయత్నం చేశాడు. తర్వాత ఇనుప ఊచతో కింద డోరు తెరిచాడు. లోపల నగదు ఉండే తలుపును తెరిచేందుకు ప్రయత్నించాడు. ఈ తతంగం 20 నిమిషాల పాటు సాగింది. సీసీ కెమెరాల ద్వారా దీన్ని గుర్తించిన బ్యాంకు కేంద్ర నిఘావిభాగం సిబ్బంది బ్రాంచి మేనేజర్ సౌజన్యకుమారికి సమాచారం ఇచ్చారు. సీఐ గీతారామకృష్ణకు విషయాన్ని తెలియజేయడంతో హుటాహుటిన పోలీసులు, బ్యాంకు అధికారులు అక్కడికి వెళ్లారు. చోరీ ప్రయత్నం ఫలించక అప్పటికే వెనుదిరిగిన వ్యక్తిని గాలించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఏటీఎం పగులగొట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తి ఝార్ఖండ్‌కు చెందిన 35 ఏళ్ల రంజిత్‌కుమార్ జాదవ్‌గా గుర్తించారు. నిందితుడు అక్కడ ప్రభుత్వ పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఉద్యోగం రెగ్యులరైజ్ కాకపోవడంతో దాన్ని వదిలేశాడు. రెండేళ్లుగా అతడి మానసికస్థితి సరిగా లేదని తెలిసింది. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో సోదరుడి ఇంటికి వెళ్లిన రంజిత్.. తిరుగుప్రయాణంలో టికెట్ తీసుకోకుండా రైలు ఎక్కడంతో టీటీఈ గుర్తించి తునిలో దించేశారు. తర్వాత పట్టణంలో తిరుగుతూ నగదు కోసం ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

# నకిలీ కాల్ సెంటర్ల వ్యవహారంపై ఈడీ కొరడా..

**రూ.13.5 లక్షలు స్వాధీనం**



**విశ్వం వాయిస్ న్యూస్ :** నకిలీ కాల్ సెంటర్లతో అమెరికన్లను మోసం చేస్తున్న వ్యవహారంలో ఈడీ అధికారులు కొరడా ఝుళిపించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఆరు చోట్ల సోదాలు నిర్వహించారు. గతంలో సైబరాబాద్ పోలీసులు, సీబీఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేసి ఈమేరకు దర్యాప్తు చేపట్టారు. మహ్మద్ అన్సారి, అకిబ్, వికాస్, దివ్యాంగ్ రావల్, ప్రదీప్ తదితరులు దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో నకిలీ కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ సంస్థల అధికారులుగా, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులుగా నటిస్తూ.. ఆ దేశవాసులకు ఫోన్లు చేస్తున్నారు. రుణ బకాయిలు చెల్లించలేదని, పన్ను ఎగవేతకు పాల్పడ్డారని బెదిరిస్తూ.. అమెజాన్ గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేయించి, బదిలీ చేయించుకుంటున్నారు. వాటిని క్రిప్టోగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఈడీ అధికారులు తనిఖీల్లో భాగంగా 12 వేల డాలర్ల విలువ చేసే క్రిప్టో కరెన్సీని గుర్తించారు. రూ.13.5 లక్షలు నగదు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు విదేశాల్లో తలదాచుకున్నట్లు గుర్తించారు.

# సంతానం పేరుతో మోసం.. బంగారంతో ఉడాయించిన దుండగుడు



**భూదాన్ పోచంపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పరిధిలోని గాంధీనగర్‌లో సంతానం లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని ఓ వ్యక్తి మోసానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతానం కోసం ఎదురుచూస్తున్న ప్రణీత దంపతులతో ఓ వ్యక్తి కేరళ యునాని వైద్యుడినని పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించాడు. ఓ తైలం ఇచ్చి దానిని ఒంటికి రాసుకుంటే 40 రోజుల్లో ఫలితం వస్తుందని నమ్మించాడు. మెడలోని బంగారాన్ని తీసి స్నానం చేసి వచ్చి తైలాన్ని రాసుకోవాలని చెప్పడంతో బాధితురాలు స్నానానికి వెళ్లగా సదరు వ్యక్తి నగలు తీసుకుని పరారయ్యాడు. స్నానం చేసి వచ్చిన తర్వాత నగలు కనిపించకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్టీరింగ్ ఊడిపడి టూరిస్టు బస్సు బోల్తా..

**10 మందికి గాయాలు**



**జమ్మలమడుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లా జమ్మలమడుగు మండలం అంబవరం క్రాస్‌రోడ్ వద్ద టూరిస్టు బస్సు స్టీరింగ్ ఊడటతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 10 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నుంచి దాదాపు 40 మంది టూరిస్టులు ఆలయాల సందర్శనకు సోమవారం బయలుదేరారు. రైల్వే కోడూరు నుంచి కన్యతీర్థానికి చేరుకొని అక్కడ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మైలవరం మండలంలోని రంగనాయకుల కోనకు బయలుదేరారు. అంబవరం క్రాస్‌రోడ్డు వద్ద బస్సు స్టీరింగ్ ఊడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు క్షతగాత్రులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు.

# దారుణం.. అత్తపై అల్లుడు హత్యాచారం

**వెల్దండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్న బిడ్డను ఇచ్చి పెళ్లి చేయడమే కాకుండా ఇల్లరికం తెచ్చుకొని పెంచి పోషిస్తున్న అత్తపై అల్లుడు అత్యాచారం చేసి హతమార్చిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో చోటుచేసుకుంది. కల్వకుర్తి సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామానికి చెందిన ఓ మహిళ తన కుమార్తెకు కొన్నాళ్ల క్రితం తిమ్మాజీపేట మండలానికి చెందిన ఓ వ్యక్తితో పెళ్లి చేసింది. తాగుడుకు బానిసైన అల్లుడు.. కుమార్తెను వేధింపులకు గురిచేస్తుండటంతో అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుంది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్తపై అత్యాచారం చేసిన అల్లుడు.. ఆపై కొట్టి చంపాడు. సోమవారం ఇరుగుపొరుగు వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి రెండో కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

# సైబర్ నేరగాళ్ల బెదిరింపులతో గిరిజనుడి బలవన్మరణం

**వెంకటాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మనస్తాపానికి గురైన ఓ గిరిజనుడు బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపురం గ్రామానికి చెందిన రామారావు(36) వాట్సప్‌నకు పక్షం రోజుల కిందట ఓ లింక్ వచ్చింది. దాన్ని తెరవడంతో అతడి ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అందులోని పూర్తి సమాచారాన్ని దొంగిలించారు. తర్వాత డిగ్రీ చదువుతున్న అతడి కుమార్తె ఫొటోను వాట్సప్ ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టుకొని తరచూ ఫోన్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేయసాగారు. ఆమెను కిడ్నాప్ చేస్తామని, ఉద్యోగం రాకుండా చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాధితుడు గ్రామ మాజీ సర్పంచి సత్యానికి చెప్పగా.. ఆయన ఐదు రోజుల కిందట ఫోన్ ద్వారా విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. రామారావు శుక్రవారం నేరుగా వెంకటాపురం పోలీసుస్టేషన్‌కు వెళ్లి విషయం చెప్పారు. సెల్‌ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు సైబర్ మోసగాళ్ల ఫోన్ నంబర్లను బ్లాక్‌లిస్టులో పెట్టామని, అధైర్యపడొద్దని సూచించారు. అయినా బెదిరింపులు రావడంతో ఆందోళనకు గురైన రామారావు శనివారం మధ్యాహ్నం సమయంలో గడ్డి మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను వెంకటాపురం కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై కొప్పుల తిరుపతిరావు పేర్కొన్నారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# పిల్లలు పాఠశాలకు వెళ్తున్నారా?

## మిస్ చేయకూడని 5 ముఖ్యమైన విషయాలు ఇక్కడ ఉన్నాయి






వేసవి సెలవులు ముగియబోతున్నాయి, పాఠశాలకు వెళ్లే పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఇది అత్యంత సవాలుతో కూడిన సమయాల్లో ఒకటి. వేసవి సెలవుల గందరగోళం నిర్మాణాత్మక స్థితికి దారితీయాలి మరియు పిల్లలు వారి విద్యా పెరుగుదల మరియు భావోద్వేగ శ్రేయస్సుకు మద్దతు ఇచ్చే దినచర్యకు తిరిగి రావాలి. పిల్లలు మరియు టీనేజ్‌కు ముందు పిల్లలకు, తరగతి గదికి తిరిగి వెళ్ళడం సజావుగా ఉండాలి. మీ పిల్లలు సజావుగా మారడానికి సహాయపడే ఐదు ఆచరణాత్మక మరియు ప్రభావవంతమైన బ్యాక్-టు-స్కూల్ తయారీ చిట్కాలు ఇక్కడ ఉన్నాయి.

**దినచర్యను తిరిగి తీసుకురండి**

ఈ పరివర్తనలో అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీ పిల్లల జీవితంలో ఒక దినచర్యను తిరిగి స్థాపించడం. ఉదయం పూట అదనపు నిద్ర మరియు రాత్రి ఆలస్యంగా పడుకునే అలవాట్లన్నింటినీ ముగించాలి. రాత్రిపూట అలా చేయడానికి ప్రయత్నించే బదులు, అరగంట సర్దుబాటు చేయడం ద్వారా ప్రారంభించండి, ఆపై నెమ్మదిగా వారిని ఆదర్శవంతమైన మేల్కొలుపు మరియు నిద్ర షెడ్యూల్‌కు తగ్గించండి. దినచర్యలు పిల్లలకు స్థిరత్వ భావాన్ని అందిస్తాయి, ఇది వేసవి స్వేచ్ఛ నుండి పాఠశాల నిర్మాణానికి మారుతున్న సమయంలో చాలా ముఖ్యమైనది. పళ్ళు తోముకోవడం, ఉదయం చదువుకునే సమయం మరియు అల్పాహారం తినడం వంటి ఉదయం చెక్‌లిస్ట్‌ను షెడ్యూల్ చేసిన సమయంలో సృష్టించడం అలవాట్లను పెంచుకోవడంలో సహాయపడుతుంది. పిల్లలు అంచనా వేయగల సామర్థ్యంతో వృద్ధి చెందుతున్నందున స్థిరత్వం ఆందోళనను తగ్గిస్తుంది. మెదడు విశ్రాంతి తీసుకోవడానికి సమయం ఆసన్నమైందని సూచించడానికి కలిసి చదవడం వంటి ప్రశాంతమైన సాయంత్రం దినచర్యను చేర్చండి. మొదటి రోజు నాటికి, మీ పిల్లల శరీర గడియారం పాఠశాలకు సిద్ధంగా ఉంటుంది.

**ఇది ఆరోగ్యంగా తినడానికి సమయం**

మాపుల్ సిరప్ తో నిండిన ఆ పాన్కేక్ లన్నీ మానేయాలి. అప్పుడప్పుడు తినడం పర్వాలేదు, కానీ మీ పిల్లలకు పోషకమైన మరియు సమతుల్య ఆహారం ఇవ్వడం ప్రారంభించడం ముఖ్యం. పోషకాహారం మరియు వ్యాయామం నేరుగా విద్యా పనితీరుపై ప్రభావం చూపుతాయి. వారికి తృణధాన్యాలు, ప్రోటీన్ మరియు పండ్లు వంటి పోషకమైన ఆహారాలను ఇవ్వండి. బెర్రీలు లేదా పెరుగు పార్ఫైట్లతో ఓట్ మీల్ వంటి శీఘ్ర, పోషకమైన అల్పాహారాలను ప్లాన్ చేయండి. శక్తిని నిలబెట్టడానికి భోజనం కూరగాయలు, లీన్ ప్రోటీన్లు మరియు సంక్లిష్ట కార్బోహైడ్రేట్ల మిశ్రమం కావచ్చు. చక్కెర కలిగిన స్నాక్స్ పరిమితం చేయండి, ఇది శక్తి నష్టాలకు కారణమవుతుంది. క్రీడలు, సైక్లింగ్ లేదా నడక ద్వారా కనీసం 60 నిమిషాల రోజువారీ శారీరక శ్రమను ప్రోత్సహించండి. వ్యాయామం మానసిక స్థితి మరియు దృష్టిని పెంచుతుంది, ఇది మంచి జ్ఞాపకశక్తి నిలుపుదలకు దారితీస్తుంది. పాఠశాల సంవత్సరం ప్రారంభంలోనే ఈ అలవాట్లను ఏర్పరచుకోండి.

**కమ్యూనికేట్ చేయండి**

తిరిగి పాఠశాలకు వెళ్లే సీజన్ కొత్త ఉపాధ్యాయుల గురించి, కఠినమైన సబ్జెక్టుల గురించి లేదా సామాజిక గతిశీలత గురించి ఆందోళనను రేకెత్తిస్తుంది. కాబట్టి, మీ పిల్లలతో వారి ఆలోచనల గురించి మాట్లాడటం చాలా ముఖ్యం. మీ పిల్లలు తమ భావాలను పంచుకోవడానికి సురక్షితమైన స్థలాన్ని సృష్టించండి. "మీరు దేని గురించి ఉత్సాహంగా లేదా ఆందోళన చెందుతున్నారు?" వంటి ఓపెన్-ఎండ్ ప్రశ్నలను అడగండి. పరిష్కారాల వైపు దూకకుండా చురుకుగా వినండి. వాస్తవిక విద్యా మరియు సామాజిక లక్ష్యాలను చర్చించండి, పరిపూర్ణత కంటే ప్రయత్నాన్ని నొక్కి చెప్పండి. చిన్న పిల్లలకు, కొత్త క్లాస్‌మేట్‌కు తమను తాము పరిచయం చేసుకోవడం వంటి రోల్-ప్లే దృశ్యాలు. టీనేజర్ల కోసం, సమయ నిర్వహణ లేదా తోటివారి ఒత్తిడి గురించి మాట్లాడండి.

**వారి అధ్యయన స్థలాన్ని ఏర్పాటు చేయండి**


వారి అధ్యయన గదిని పునర్వ్యవస్థీకరించాల్సిన సమయం ఇది. ఇంట్లో నిశ్శబ్దంగా, చిందరవందరగా లేని అధ్యయన ప్రాంతాన్ని ఏర్పాటు చేయండి. పాఠశాల సరఫరా జాబితాను చూసి, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బరులు, నోట్‌బుక్‌లు, కాలిక్యులేటర్, రూలర్లు మరియు సబ్జెక్టుకు సంబంధించిన సామగ్రిని చేర్చండి. సామాగ్రిని చక్కగా మరియు అందుబాటులో ఉంచడానికి పెన్సిల్ హోల్డర్లు, ట్రేలు లేదా చిన్న డ్రాయర్‌ల వంటి ఆర్గనైజర్‌లను ఉపయోగించండి. గదిలో మంచి లైటింగ్ మరియు తక్కువ అంతరాయాలు ఉన్నాయని నిర్ధారించుకోండి. అంకితమైన అభ్యాస స్థలం మొదటి రోజు నుండే దృష్టి మరియు క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది.

**మీ పిల్లల విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోండి**

వేసవిలో సుదీర్ఘ విరామం తర్వాత, వారిని తిరిగి విద్యారంగంలో పెట్టుబడి పెట్టడానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యం. వేసవిలో నేర్చుకోవడంలో నష్టం నిజమైనది. సరదాగా, తక్కువ ఒత్తిడితో కూడిన కార్యకలాపాలతో పిల్లలను తిరిగి విద్యారంగంలోకి తీసుకురావడానికి వీలు కల్పించండి. చిన్న పిల్లల కోసం, ప్రతిరోజూ కలిసి చదవండి లేదా లెక్కింపు మార్పు వంటి గణిత ఆటలు ఆడండి. పెద్ద పిల్లల కోసం, త్వరిత రిఫ్రెషర్‌ల కోసం ఆన్‌లైన్ వనరులను ప్రయత్నించండి. వారానికి ఒక పుస్తకం చదవడం లేదా గుణకార పట్టికలను నేర్చుకోవడం వంటి నిర్దిష్ట, సాధించగల లక్ష్యాలను కలిసి నిర్దేశించుకోండి. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి చిన్న విజయాలను జరుపుకునేలా చూసుకోండి.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 10 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

## గోదావరి జిల్లాల వారికి

# క్షమాపణలు

### - నా వల్ల మీరు ఇబ్బందులు పడ్డారు
### - పట్టుబడ్డ "పెద్దపులి" ఆవేదన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం :**

**గోదావరి జిల్లాల వారందరికీ నమస్కారమండి...**

**నేను మీ ప్రాంత ప్రజలను, రైతులను, అధికారులను కొన్ని రోజుల పాటు ఇబ్బంది పెట్టిన "పెద్దపులి"ని.**

**"ఏమ్మా... నిన్ను కష్టపడి పట్టుకుని వైజాగ్ అనిమల్ రెస్క్యూ సెంటర్ కి పంపించారు కదా...**

**ఇప్పుడు ఏమి చెప్పడానికి వచ్చావ్?" అంటూ కోపం తెచ్చుకోకండి.**

**ఇన్ని రోజులు మీ మధ్య గడిపిన అనుభవాలను, చూసిన విషయాలను ఇలా మీతో పంచు కోవాలనిపించింది!!.**

నాది మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతం. అక్కడి నుంచి ఎలా బయలుదేరానో, ఎలా వచ్చానో నాకే పూర్తిగా తెలియదు. అలా తెలంగాణ కావాడిగుండ్ల నుంచీ ఏలూరు జిల్లా పందిరిమామిడిగూడెం కు జనవరి నెల 20వ తేదీన చేరుకున్నాను. అక్కడ కొన్ని రోజులు అటు ఇటు తిరిగాను. తిరిగి అడవుల్లోకే వెళ్లిపోదామని అనిపించింది. కానీ తూర్పు గోదావరి జిల్లాను కూడా చూసి వచ్చేద్దామనే ఉద్దేశంతో గోదావరి నది దాటి పట్టిసీమ మీదుగా సీతానగరం మండలం చిన్న కొండేపూడి గ్రామానికి జనవరి 31న చేరుకున్నాను. అక్కడి నుంచి రంపచోడవరం అడవుల్లోకి వెళ్లిపోవాలనిపించింది. కానీ గోదావరి జిల్లా వచ్చాక కాస్త ముందుకు వెళ్దామని నిర్ణయించుకున్నాను. అలా ఫిబ్రవరి 1న తొర్రేడు ప్రాంతానికి చేరుకున్నాను. రెండు ఆవులు, ఒక దూడపై దాడి చేసి చంపిన విషయం వాస్తవమే.

ఆ తరువాత ఫిబ్రవరి 2న రాజమహేంద్రవరం రూరల్ మండలం వెంకటనగర్ ప్రాంతంలో సంచరించాను. ఎవరికి కనిపించకుండా రాత్రివేళల్లోనే తిరుగుతూ ఉండేదాన్ని. నా పాదముద్రల ఆధారంగా అధికారులు కదలికలను గుర్తించారు. రాజమహేంద్రవరం సమీపానికి చేరుకునే సరికి నాపై నిఘా మరింత పెరిగింది. రాష్ట్ర యంత్రాంగం మొత్తం నన్ను పట్టుకోవడానికి రంగంలోకి దిగింది. అయినా నేను వెనక్కి తగ్గలేదు. ఫిబ్రవరి 3న గామన్ వంతెన వద్ద ఆటోనగర్ మీదుగా నాలుగు లైన్ల జాతీయ రహదారిని దాటి ఎస్‌వీపీఎస్ ఫంక్షన్ హాల్ సమీపానికి చేరుకున్నాను. చీకటి కదా... ఎవరు చూడరనుకున్నాను. కానీ ఇద్దరు యువకులు కారులో వెళ్తూ నన్ను సెల్‌ఫోన్‌లో బంధించారు. ఆ వీడియో సోషల్ మీడియా, మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంది. ప్రజలు కూడా ఆందోళన చెందారు. రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు రాత్రి పగలు తేడా లేకుండా నా ఆనవాళ్ల కోసం అధికారులతో పాటు సోషల్ మీడియా టీంతో తిరిగారు. ఆయన హడావుడికి భయపడి ఫిబ్రవరి 4న సాటిలైట్ సిటీ కొండపైకి వెళ్లి కొంత సేద తీరాను. ఇదే సమయంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గారు కూడా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో చర్యలు మరింత వేగం పుంజుకున్నాయి. పెద్దలతో గొడవెందుకని ఫిబ్రవరి 5న మండపేట మండలం ద్వారపూడి సమీపంలోని వేములపల్లి ప్రాంతానికి చేరుకున్నాను. అక్కడ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గారు కూడా తనదైన శైలిలో చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గారు, ఎస్పీ నరసింహా గారు స్వయంగా రంగంలోకి దిగారు. పూణె నుంచి ప్రత్యేక రెస్క్యూ టీమ్‌ను దింపారు. పిల్లలు మాత్రం నన్ను తెగ ఆహ్వానించేవారు... స్కూళ్లకు సెలవులు వస్తాయేమోనని ఆశపడుతూ!

ప్రజలు, అధికారులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు చూసి అటవీ ప్రాంతానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాను. కానీ ఒక కోరిక మిగిలిపోయింది. ఎప్పుడూ కొండలు, చెట్లు, రాళ్ల మధ్య ఉండే నేను పచ్చని వరి చేలు ఎలా ఉంటాయో చూడాలనిపించింది. అందుకే రాయవరం మండలం కూర్మాపురానికి వెళ్లాను. అక్కడి పచ్చదనం నన్ను బాగా ఆకట్టుకుంది. ఆకలి ఉన్నా లెక్కచేయకుండా పంట పొలాల్లో పట్టపగలే పరుగులు తీశాను. అడవికి రాజు అయిన నన్ను చూసేందుకు జనాలు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. చివరకు మత్తు మందు తుపాకీ ద్వారా శుక్రవారం రాత్రి నన్ను పట్టుకున్నారు. శనివారం ఉదయానికి విశాఖపట్నం అనిమల్ రెస్క్యూ సెంటర్ కి తరలించారు. అక్కడి కి వెళ్లినందుకు బాధగా లేదు. ఎప్పుడూ అడవుల్లోనే ఉండకుండా, ఇలా మీలాంటి ఎంతో మందిని చూసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నేను ఏ మనుషులకి ఇబ్బంది పెట్టలేదు కదా,, మూడేళ్ల కే నన్ను బంధించి ఇక మిగిలిన జీవితం అంతా ఇక్కడ బందీగా గడపటం అస్సలు ఇష్టం లేదు. దిగులుగా ఉండి ఏమీ తినాలని అనిపించట్లేదు ??.



నా సంచరణలో ఆవులు, దూడలను చంపిన విషయం తప్పే. ఆహారం కోసం అలా చేయాల్సి వచ్చింది. మనుషులపై మాత్రం ఎప్పుడూ దాడి చేయలేదు. చేయాలనుకుంటే నాకు అది పెద్ద విషయం కాదు. అయినా కొందరు "కాల్చేయొచ్చు కదా" అంటూ అధికారులను తక్కువ చేసి మాట్లాడారు. నేను జాతీయ జంతువును. మా జాతి అడవుల సమతుల్యతకు, పర్యావరణ సమతుల్యతకు కీలకం. అందుకే మమ్మల్ని సజీవంగా పట్టుకోవడమే చట్టం. మీరు అందరూ నన్ను తిరిగి అడవి లోకి కానీ ఏదేని నేషనల్ పార్క్ లో కానీ వదిలితే. స్వేచ్ఛగా బతుకుతానని, ఎవ్వరికీ హాని తలపెట్టనని హామీ ఇస్తున్నాను.. ప్రభుత్వానికి, అటవీ అధికారులకి మీ ద్వారా నేషనల్ పార్క్ లో నన్ను వదలమని కోరుకొంటున్నాను. ఇక్కడ బందీగా ఉండే లాగ నాకు ఏ అనారోగ్యం లేదని చెప్పండి ప్లీజ్ ??..

మత్తు మందు ఇచ్చి పట్టుకునే సమయంలో కొందరు ఆకతాయిలు నా తోక పట్టుకోవడం, సెల్ఫీలు తీసుకోవడం ద్వారా అధికారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు??. అటువంటి వారి విషయం మీకే వదిలేస్తున్నాను. నా వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు, రైతులు, అధికారులు, ఉద్యోగులకు మరోసారి క్షమాపణలు. నా కవరేజ్ చేసిన మీడియా మిత్రులకు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు కృతజ్ఞతలు. అయితే ఏఐ వీడియోలతో గందరగోళం సృష్టించిన వారిపై మాట్లాడటం అవసరం లేదని భావిస్తున్నాను. మహారాష్ట్ర నుంచి వచ్చి తెలుగులో ఎలా మాట్లాడుతున్నానని అనుమానం రావచ్చు. గోదావరి నీళ్లు గుక్కెడు తాగితే గోదావరి బాస తన్ను కుంటూ వస్తుందంటారు కదా... వారం రోజులైతే చాలదా!

**ఇట్లు,**

**గోదావరి చెంతన సంచరించిన "పెద్దపులి"**

**మన ప్రాంతానికి వచ్చిన పెద్దపులి గురించి సరదా కబుర్లు...**

**తీరుబడి ఉన్నవారు చదవగలరు.**

## ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తులు

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేట్ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఆర్థికంగా బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆన్లైన్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మార్చి 10వ తేదీతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుం దన్నారు.పూర్తి వివరాలకు మండల విద్యాశాఖ అధి కారి,జిల్లా సమగ్ర శిక్షా కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

## అంజుమన్ -ఏ -ఇస్లామీయ సంస్థ ఆస్తులను పరిరక్షించండి

### కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసిన వైస్సార్సీపీ మైనారిటీ సెల్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంజుమన్ -ఏ -ఇస్లామీయ సంస్థకు చెందిన ఆస్తులను ప్రైవేటీకరణ చేయుటకు సిద్ధమైన కూటమి ప్రభుత్వ నిర్ణయానికి నిరసిస్తూ..ఈ ఆస్తులను పరిరక్షించాలి అని కలెక్టరేట్ లో ఏ.వో సమక్షంలో జిల్లా నుండి తరలివచ్చిన వైయస్సార్సీపి మైనార్టీ సెల్ వివిధ విభాగాల రాష్ట్ర,జిల్లా నాయకులు, కార్యకర్తల సమక్షంలో మెమోరాండం సమర్పించారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు యండి హమీద్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హసీనా, రాష్ట్ర అధికార ప్రతినిధి అలీ, రాష్ట్ర మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజామ్, వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షులు ఆరిఫ్, రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా బేగ్, వక్ఫ్ బోర్డు మాజీ చెర్మన్ కరీం ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం భాషా, జిల్లా కార్యదర్శి మస్తాన్ బేగ్, మౌలాలి మీరావలి, రాజమహేంద్రవరం రూరల్ మైనార్టీ సెల్ ఇంచార్జ్ చానా, రాజమహేంద్రవరం నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆరిఫుల్లాఖాన్,నిడదవోలు నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇంచార్జ్ చాంద్ బాషా, రాజానగరం మైనారిటీ సెల్ ఇంచార్జ్ కాలా భాషా, గోపాలపురం ఇంచార్జ్ యూసఫ్ ముస్తఫా, మాజీ సంచార జాతుల డైరెక్టర్ షకీలా బేగం, మహిళ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకురాలు సమీరా బేగం మరియు నాయకులు అల్తాఫ్ మదీనా భాషా, అప్సర్ బేగ్, ఇబ్రహీం షరీఫ్, జిలాని, మ్యాజిక్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## పుర ప్రజలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకి సహకరించండి



### కమీషనరు టి.వి. రంగారావు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘ పరిధిలో ఉన్న ప్రజలందరూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సహకరించాలనీ కమీషనరు టి.వి.రంగారావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డు అనే విధానాన్ని తీసుకువస్తుందన్నారు. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కార్యక్రమం చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మండపేట పురపాలక సంఘ పరిధిలో స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వే సిబ్బంది ఇంటికి వచ్చినపుడు తగిన వివరాలు అందించి సహకరించాలని కోరారు. ఈ సర్వేని ప్రజలందరూ బాధ్యతగా చేయించుకోవాలన్నారు.

## ఎమ్మెల్సీ తోటను పరామర్శించిన పలువురు ప్రముఖులు






**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్ ఛార్జ్, రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్, వైసిపి పి ఎ సి సభ్యులు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును పలువురు ప్రముఖ నాయకులు సోమవారం పరామర్శించారు. ఆయనను రామచంద్రాపురం మండలం వెంకటాయపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ స్వగృహానికి వెళ్లి ఆయన ను పరామర్శించారు. తోట త్రిమూర్తులు సోదరుడు దివంగత తోట సత్యనారాయణ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మాజీ మంత్రి పేర్ని నాని, రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, ఎమ్మెల్సీ బొమ్ము ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ వి రవీంద్ర, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ముద్రగడ పద్మనాభం కుమారుడు ముద్రగడ గిరి, కుమార్తె క్రాంతి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, పల్లం రాజు, కపిలేశ్వరపురం మండల అధ్యక్షులు గూటం సత్యనారాయణ, ఎంపీపీ జుత్తుక వెంకటలక్ష్మి సూరిబాబు, కపిలేశ్వరపురం వైసిపి నాయకులు, రామచంద్రపురం, అమలాపురం, మండపేట మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మహిళా విభాగం అధ్యక్షురాల్లు, శెట్టిబత్తుల రాజబాబు, రామచంద్రపురం వైసీపీ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్, చెల్లుబోయిన శ్రీనివాస్, చిక్కాల గణేష్, అత్తిలి సీతారామ స్వామి, పెదపూడి ఎంపీపీ కేతా తులసీ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట రెడ్డి, పెదపూడి మండల 14మంది సర్పంచ్లు అధిక సంఖ్యలో తోట త్రిమూర్తులు అభిమానులు పాల్గొన్నారు.

### పాపికొండలు అందాలు తిలకించడానికి

## భారీగా పర్యాటకులు

### 8 బోట్లలో 459 పర్యాటకులు



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** పచ్చని ప్రకృతి అందాల నడుమ ఉప్పొంగుతున్న గోదావరిలో బోటు ప్రయాణం వర్ణణానీతం. అలాంటి గోదావరి లో సుమారు ఆరు గంటలు సాగే పాపికొండలు విహార యాత్ర పర్యాటకులను మైమరపిస్తుంది అంటే అతిశయోక్తి కాదు. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పోశమ్మగండి ఆలయం వద్ద నుండి ప్రతీ రోజు పర్యాటకులు పాపికొండలు విహారయాత్రకు వెళ్తారు.ఆదివారం సెలవు కావడం తో రాష్ట్రంలోని నలు మూలల నుండి పర్యాటకులు భారీ సంఖ్య లో పోశమ్మగండి బోట్ పాయింట్ వద్దకు చేరుకొని సుమారు 8 బోట్ల లో 459 మంది పాపికొండలు విహార యాత్రకు వెళ్లినట్టు అధికారులు తెలిపారు.విహారానికి వెళ్తున్న వారికి పర్యాటక శాఖ అధికారులు లైఫ్ జాకెట్ లు ధరించని యెడల జరుగు అనర్ధాలపై పలు సూచనలు చేశారు.


### సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన మేడెం శ్రీనుకు అనా రోగ్య రీత్యా వైద్య ఖర్చుల నిమిత్తం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణను సహాయం కోరగా వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1,51,666/-ల ఎల్ఓసిని వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోర్కెలు తీర్చే తల్లి దర్శనానికి ఇంకెంత కాలం నిరీక్షించాలి...?



### గోదావరి వరద ప్రవాహం తగ్గినా అమ్మవారి దర్శనానికి ఆటంకం

**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** వందల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనాలకు ఆలయానికి వస్తున్నా ఆలయం వరకూ వచ్చి ఆలయ ప్రవేశం లేక వెనుకకు వెళ్లిపోతున్న భక్తులు వేదనకు గురి అవుతున్నారు. రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం లో గల ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృ శ్రీ గండి పోశమ్మ అమ్మవారు స్వయంభూ గా వెలసి కోర్కెలు తీర్చే తల్లిగా పూజలు అందుకొంటుంది అయితే పోలవరం ప్రాజెక్ట్ లోని కాపర్ డ్యాం కారణంగా గోదావరి వరద ఆలయం లోకి ప్రవేశించడంతో గత ఏడాది జూలై రెండో వారంలో ఆలయం మూత పడింది. ఈ ప్రభావం గత మూడేళ్లుగా ఉన్నప్పటికీ ఏటా నవంబర్ నెలలో గ్రామస్థులు, ఆలయ అధికారులు ఆలయ సంప్రోక్షణ జరిపించి ఆలయ ప్రవేశం కల్పించే వారు. ఈ ఏడాది మాత్రం ఫిబ్రవరి నెల రెండో వారంలోకి వచ్చినప్పటకీ ఆలయం తెరుచుకోక పోవడం తో భక్తులు నిరాశ చెందుతున్నారు.మరొక వైపు ఆలయం గోదావరి ప్రవాహం నుండి బయట పడడం తో భక్తులు ఆలయం వెలుపల నుండి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి పోశమ్మ అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చెయ్యాలని భక్తులు కోరుతున్నారు.



# ఘనంగా ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పుట్టినరోజు వేడుకలు



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, ముమ్మిడివరం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) 53వ జన్మదిన వేడుకలు కాట్రేనికోన మండలంలోని గ్రంధి నాగేశ్వరరావు కళ్యాణ మండపంలో పి ఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేకును కోసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు,దాట్ల పృధ్వి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుచ్చిబాబు సేవలను కొనియాడారు. అనంతరం కాట్రేనికోన పీహెచ్సీ లో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. అలాగే కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్ లో సుమారు 400 మంది విద్యార్థులకు మధ్యాహ్నం ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ,, మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్, నీటి సంఘం డిసి ఆకాశం శ్రీనివాస్, నడింపల్లి సుబ్బరాజు, రాష్ట్ర ఆక్వా డైరెక్టర్ విత్తనాల బుజ్జి,ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, ఇసుక పట్ల వెంకటరమణ, బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ , బిజెపి మండల అధ్యక్షులు మట్ట శివ కుమార్, ముమ్మిడివరం మార్కెటింగ్ డైరెక్టర్ మట్ట సూరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు పుల్లారావు,వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, సర్పంచ్ రంబాల రమేష్, సర్పంచ్ సీతారామకృష్ణంరాజు, బండారు ఏసు,త్సవటపల్లి నాగు త్సవటపల్లి శ్రీనివాస్, జంగా శ్రీనివాస్, చీకురుమిల్లి చక్రదరరావు, నేలపాటి చెంచలరావు, నూకల దుర్గ బాబు, మోకా బాల ప్రసాద్, గ్రంధి నానాజీ,వనచర్ల నాగేశ్వరరావు, వంగ దుర్గ బాబు,ఎస్ వి ఎస్ రవి వర్మ,జొన్నాడ రాజారావు, సుధా రాఘవేంద్రరావు, గిడ్డి చంటి, ఉచ్చుల నారాయణ,కాంద్రేకుల సత్యప్రసాద్, కొండేటి చినబాబు, వంగా వాసు,పిటి వర్మ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సాగునీరు అందక కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

అల్లవరం మండల పరిధిలో సాగు భూములకు సాగునీరు అందకపోవడంతో పలుగ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్‌ను స్పందన కార్యక్రమంలో కలిసి ఫిర్యాదు చేశారు. కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, పేరూరు బాడవ, రోల్లపాలెం, మూడు తూములు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పూర్తిస్థాయిలో నీరు అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉందని రైతులు వాపోయారు. గ్రామ స్థాయిలో సాగునీరు లేకపోవడంతో వరి సహా ఇతర పంటలు ఎండిపోతున్నాయని, ఈ పరిస్థితి కొనసాగితే పూర్తిస్థాయిలో పంట నష్టం తప్పదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందకపోవడానికి ప్రధాన కారణంగా ఈదరపల్లి వద్ద చేపట్టిన కొత్త వంతెన నిర్మాణాన్ని రైతులు పేర్కొన్నారు. వంతెన నిర్మాణం చేపట్టే దశలో పక్కనే తాత్కాలికంగా తూరలు, ఇసుక బస్తాలతో మరో వంతెన నిర్మించడంతో ఆయా గ్రామాలకు వెళ్లే సాగునీటి ప్రవాహం పూర్తిగా ఆగిపోయిందని తెలిపారు. ఈ తాత్కాలిక నిర్మాణమే తమ సాగునీటి సమస్యకు ప్రధాన అడ్డంకిగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీరు నిలిచిపోవడంతో వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలు ప్రమాదంలో పడ్డాయని, ఇప్పటికే పెట్టుబడులు భారీగా పెట్టామని, ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే తీవ్ర ఆర్థిక నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు స్పష్టం చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ స్వయంగా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, తాత్కాలిక వంతెన వల్ల ఏర్పడిన అడ్డంకులను తొలగించి, ఆయా గ్రామాల సాగు భూములకు వెంటనే పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

# డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి విశేష స్పందన

## సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చేపట్టిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సోమవారం ఉదయం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 48 మంది విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు లో ఎదురవుతున్న ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల అంచనాలు (ఎస్టిమేషన్లు), విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు, విద్యుత్ స్తంభాలు మరియు లైన్ల మార్పిడి, స్తంభాలపై వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూ, వినియోగదారుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును పూర్తిగా పరిష్కరించే వరకు కార్పొరేట్ కార్యాలయ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని వెల్లడించారు. అలాగే ఈ కార్యక్రమంతో పాటు వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయడం ద్వారా లేదా వాట్సాప్ నంబర్ 94936 81912కు సందేశం పంపడం ద్వారా కూడా తమ విద్యుత్ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం వి.విజయలలిత, జీఎం ఎం.ఝాన్సీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆలమూరు తహసిల్దారును

# సస్పెండ్ చేయాలి

## బీఎస్పీ డిమాండ్




విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు మండల తహసిల్దారును సస్పెండ్ చేయాలని కోరుతూ బడుగు వానిలంక, పొట్లంక గ్రామాలకు చెందిన ఎస్సీ రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. 1976 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ భూముల్లోని 110 పట్టాలను పేదలకు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయా లబ్ధిదారులు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల ఆలమూరు మండల రెవెన్యూ అధికారి (తహసిల్దారు) కొంతమంది దళారుల మాటలు విని రాజకీయ దురుద్దేశంతో తప్పుడు సర్వే చేయిస్తున్నారని రైతులు ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులను తప్పుదోవ పట్టిస్తూ కొత్తగా కొంతమందికి పట్టాలు ఇవ్వడానికి ప్రయత్నం జరుగుతోందని వారు తెలిపారు. ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అడ్వైజర్ శాఖ రాజారావు, కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రపుకొత్తయ్య నాయకత్వం వహించారు. అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొలమూరి మోహన్‌బాబు సంఘీభావంగా పాల్గొన్నారు. దళారులకు కొమ్ముకాస్తున్న తహసిల్దారును వెంటనే సస్పెండ్ చేయాలని, బినామీ పేర్లతో జారీ చేసిన పట్టాలను రద్దు చేయాలని, నిజమైన సాగుదారులకు న్యాయం చేయాలని ప్రభుత్వ అధికారులను వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకట రత్నం, వేముళ్ల సత్యవతి, నక్క దీనమ్మ, కె.రాఘవ, ఆర్.విజయ్, గొల్లపల్లి ఆశీర్వాదం, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, ఆసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో స్టేట్ బ్యాంక్ అగ్రగామి

## ఎస్.యానాం ఆరోగ్య కేంద్రానికి వైద్య సామాగ్రి పంపిణీ



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేవలం బ్యాంకింగ్ సేవలకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతగా సమాజ హిత కార్యక్రమాలను నిర్వహించడంలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్బిఐ జిల్లా రీజినల్ మేనేజర్ అశోక్ నాగరాజన్ పేర్కొన్నారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అవసరాలకు ఉపయోగపడే కంప్యూటర్, యుపీఎస్, ఇసిజీ మిషన్, ఇన్వెర్టర్,రెండు ఫెటల్ డ్రాపర్స్,నాలుగు నేబిలైజర్స్, ఆఫీస్ టేబుళ్లు వివిధ రకాల వైద్య పరికరాలు, సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ నాగరాజన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో బ్యాంకు తరపున ఈ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులకు అందజేసిన కిట్ల ఉపయోగాలు, ప్రస్తుత కాలంలో ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, హెచ్ఆర్ మేనేజర్ వెంకట సత్యనారాయణ,బ్రాంచ్ మేనేజర్ ఎన్. ఉదయ్ శంకర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వివిధ గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందరావు



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

అమలాపురం పరిసర ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కఠిన సమయంలో ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. డి. రావులపాలెం గ్రామానికి చెందిన రెడ్డి నాయుడు ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఒంటెద్దు పద్మావతి మృతి పట్ల కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దేవగుప్తం గ్రామానికి చెందిన పెచ్చెట్టి సత్యవతి, తానెలంక సత్యవతి మృతి పట్ల కూడా ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను పరామర్శించి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే యేంట్రుకోన గ్రామానికి చెందిన జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రె సూరిబాబు తల్లి మహాలక్ష్మి ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఇలాంటి విషాద సమయంలో కుటుంబాలకు భరోసా ఇవ్వడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

## అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొని బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డీఎస్పీ ప్రతి అర్జీదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యల నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 33 ఫిర్యాదులు అందాయి. వీటిలో ప్రధానంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు తదితర సివిల్ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, వాటిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డీఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తామని, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు వాకపల్లి వెంకటేశ్వరరావుకు


# ఏపిడబ్ల్యూజేఎఫ్ నేతల పరామర్శ



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రిలో గుండెకు స్టెంట్ వేయించుకుని చికిత్స పొందుతున్న సీనియర్ పాత్రికేయ మిత్రుడు వాకపల్లి వెంకటేశ్వర రావును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యుజేఎఫ్) ప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఏపిడబ్ల్యుజేఎఫ్ నాయకులు మట్టపర్తి శ్రీనివాస్, కడలి రాజు, పెయ్యల వెంకటేశ్వరరావు, కడలి సూరిబాబు, పరమట భీమా మహేష్ ఆసుపత్రికి వెళ్లి వెంకటేశ్వర రావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి వివరాలు సేకరించారు. వాకపల్లి వెంకటేశ్వర రావు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు ధైర్యం చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఏపిడబ్ల్యుజేఎఫ్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు భరోసా వ్యక్తం చేశారు. అవసరమైతే సంస్థ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సీనియర్ పాత్రికేయుడి ఆరోగ్యంపై జర్నలిస్టు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ వృత్తి జీవితంలో క్రియాశీలకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

# ఒక్క మాట.. 52 కేసులు : మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసు షాక్



వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసు కేసులు వెంటాడుతున్నాయి. ఆయనపై నమోదవుతున్న కేసులు, కోర్టులో దాఖలు చేస్తున్న పీటీ వారెంట్లను పరిశీలిస్తే మాజీ మంత్రి ఇప్పట్లో జైలు నుంచి బయటపడే మార్గం కనిపించడం లేదని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మొత్తం 52 కేసులు నమోదయ్యాయి. జనవరి 31న గుంటూరు నగరంలోని చిల్లీస్ సెంటర్ లో జరిగిన గొడవలో సీఎం చంద్రబాబుపై అంబటి అనుచిత వ్యాఖ్యలు చేశారని కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అదే రోజు రాత్రి అంబటిని అరెస్టు చేసి నల్లపాడు పోలీసుస్టేషన్ కు తరలించారు. ఆ మరునాడు కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ప్రస్తుతం రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటి రాంబాబుపై కూటమి ప్రభుత్వం వరుస కేసులు నమోదు చేయిస్తోంది. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కారణంగా రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి నేతలు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు పోలీసులు ఇదే ఆరోపణలపై అరెస్టు చేయగా, రాజమండ్రి, అనపర్తి, చిత్తూరు బాపట్లతో సహా పలు పోలీసుస్టేషన్ లో ప్రతి రోజూ కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. రాంబాబుపై ప్రస్తుతం నమోదైన కేసుల సంఖ్య ఆఫ్ సెంచరీ దాటడాన్ని విపక్షం వైసీపీ తీవ్రంగా తప్పుపడుతోంది. తమ పార్టీ నేతను వేధించాలనే ఏకైక ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోందని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మాజీ మంత్రి అంబటిపై నమోదు అవుతున్న కేసులు, ఇప్పటికే పెండింగులో ఉన్న కేసుల్లో పీటీ వారెంట్లు దాఖలు చేయడం చూస్తుంటే మాజీ మంత్రిని ఇప్పట్లో జైలు నుంచి విడుదల చేయకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉన్నట్లు కనిపిస్తోందని విశ్లేషిస్తున్నారు. ఇంతకు ముందు అరెస్టు అయిన వైసీపీ నేతలు, సానుభూతిపరుల మాదిరిగానే మాజీ మంత్రి అంబటి రాంబాబును సైతం రాష్ట్రంలో వివిధ పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పాలని ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంబటి రాంబాబుపై ప్రస్తుతం 3 పీటీ వారెంట్లు జారీ అయ్యాయని అంటున్నారు. మరిన్ని పీటీ వారెంట్లు దాఖలు చేసే పరిస్థితి కనిపిస్తోందని అనుమానిస్తున్నారు. మరోవైపు అంబటికి రాజమండ్రి జైలులో సరైన భద్రత లేదని వైసీపీ ఆందోళన చేస్తోంది. ఈ విషయమై హైకోర్టులో న్యాయపోరాటం చేయాలని నిర్ణయించింది. కాగా, సీఎంపై అనుచిత వ్యాఖ్యల కేసులో రిమాండులో ఉన్న అంబటిని సోమవారం పట్టాభిపురం పోలీసులు పీటీ వారెంటుపై గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. గత ఏడాది నవంబరు 12న ప్రభుత్వ మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంబటి ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు గుంటూరులో ఆందోళన చేశారు. ఆ సమయంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లుతో అంబటికి వాగ్వాదం జరిగినట్లు చెబుతున్నారు. దీనిపై పోలీసు విధులకు ఆటంకం కలిగించారని అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసుపై తాజాగా పీటీ వారెంటు తీసుకుని అంబటిని కోర్టులో హాజరుపరచగా, ఈ నెల 22 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అంబటిపై ప్రభుత్వం తరఫున వరుస కేసులు నమోదు అవుతుండగా, ఆయన న్యాయవాదులు ఆ కేసులను కొట్టివేయాలని హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు. ఇప్పటివరకు 7 కేసులను క్వాష్ చేయాలని అంబటి తరఫు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్లను దాఖలు చేశారు. పట్టాభిపురం, నగరంపాలెం, నల్లపాడు, మంగళగిరి పోలీసుస్టేషన్లలో నమోదైన కేసులను రద్దు చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అక్రమంగా కేసులు పెట్టారని, రిమాండ్ విధించడం చట్టవిరుద్ధమని ఆయన తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్లపై ఫిబ్రవరి 5, 2026న విచారణ జరిగింది. కోర్టు ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 11కు వాయిదా వేసింది. ఇదే సమయంలో జైలులో సౌకర్యాలు, కస్టడీ, బెయిల్ వంటి అంశాలపై గుంటూరులోని స్థానిక కోర్టులో కూడా విచారణ కొనసాగుతోంది.

# పేదలకు మెరుగైన వైద్య సేవలకు ఎమ్మెల్యే ఆనందరావు శంకుస్థాపనలు



అమలాపురం రూరల్ / బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ : బండారులంక గ్రామంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సోమవారం అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు చేతుల మీదుగా రెండు విలేజ్ హెల్త్ క్లినిక్ లకు శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా విలేజ్ హెల్త్ క్లినిక్లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు, గ్రామ టిడిపి అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు , బొర్రా ఈశ్వర్రావు, చొల్లంగి సాయిబాబా, అధికారి జయ వెంకటలక్ష్మి, కొండా సూర్యకుమారి, మందా గెద్దయ్య , ఈటకోట నాగేశ్వరావు, బళ్ళ వెంకటేశ్వరరావు , ఆశపు రామలింగేశ్వర్రావు, కడలి వెంకటేశ్వర్రావు, యిళ్ళ మురళి, కాశిన బాబి ,యాళ్ళ కుమార్ , చింతపట్ల గంగా సత్యనారాయణ , కొల్లి అంబేద్కర్ , ఉందుర్తి జీవరత్నం, ఈతకోట రాజేష్, దంగేటి శ్రీరామ్, కొండా సత్యనారాయణ రాజు, ఏకుల విజయ్, కాశిన ఫణి, తులా సతీష్ గ్రామ టిడిపి నాయకులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



### జనసేన ఆవిర్భావం నుంచి

# శాండీ ప్రధాన భూమిక ఎనలేనిది

## సందీప్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదానం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ యువ నాయకుడు చావ్వాకుల సందీప్ పుట్టినరోజు సందర్భంగా కాకినాడ మెయిన్ రోడ్ గ్లాస్ హౌస్ సెంటర్ లో ఉన్న శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ లో బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పంతం సందీప్ గారి సమక్షంలో కేక్ కటింగ్ అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించడం జరిగింది . ఈ కార్యక్రమంలో అనేకమంది మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదానం చేయడం జరిగింది. పంతం సందీప్ మాట్లాడుతూ శాండీ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కాకినాడ రూరల్ లో ముఖ్య భూమిక పోషించడంతోపాటు పార్టీ అనేక కార్యక్రమాలకు తన శక్తికి మించి సేవ చేయడం జరిగిందని తన తండ్రి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి ఎప్పుడు అందుబాటులో ఉంటూ రూరల్ జనసేన పార్టీకి తన సేవలను అందిస్తున్నారు.గత నాలుగు సంవత్సరాలుగా తన పుట్టినరోజు పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కొన్ని వందల మందికి సమయానికి రక్తాన్ని అందిస్తున్నారని చెప్పి శాండీకి సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ యువసేన అధ్యక్షుడు సతీష్ శ్రీ యువసేన సభ్యులు సందీప్ శ్రేయోభిలాషులు, అన్నదమ్ములు తదితరులు పాల్గొన్నారు.

# చర్చికి స్టార్ లైట్ ఫౌండేషన్ వితరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరంలో అతి నిరాడంబరంగా ప్రారంభమైన స్టార్ లైట్ ఫౌండేషన్ సంస్థ సమాజ సేవలో నెమ్మదిగా ఒక్కో అడుగూ ముందుకు వేసుకుంటూ వెలుతోంది. శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ నెలా 9 న గర్భిణీ స్త్రీలకు నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో వైద్య పరీక్షలు చేయించుకున్న మహిళలు అందరకు రెండు సంవత్సరాల పాటు మధ్యాహ్నం పూట ఉచితంగా భోజనం సౌకర్యం కల్పించారు. ఇదే కోవలో వేళంగి గ్రామంలోని కల్వరి ప్రార్థన మందిరానికి బల్లారాధన సామాగ్రిని ఆదివారం రాత్రి సమర్పించారు. క్రైస్తవ ఆరాధనలో అత్యంత ప్రాముఖ్యమైన బల్లారాధనకు అవసరమైన సరైన వస్తు సామాగ్రి లేని విషయాన్ని గమనించిన ఫౌండేషన్ సభ్యులు సుమారు రూ. 2,600 లను వెచ్చించి ద్రాక్షా రసమును పంపిణీకి ఉపయోగించే స్టీలు ప్లేటును, 56 స్టీలు గ్లాసులను కొని ఆలయానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్టార్ లైట్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తిన తాతాజీ, సభ్యులు గునపర్తి అపురూప్, గునపర్తి రాఘవ, సంఘ కాపరి యు.మోషెరాజు పాల్గొన్నారు.


### వ్యతిరేక భావనలు

# అదుపు చేసే శక్తి మనలోనే ఉంది

## 'మీ ఆనందం మీ చేతుల్లోనే ..' అంశంపై బికె శివాని ప్రసంగం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎవరైనా మీ గురించి చెడ్డగా చెప్పినా, ప్రతికూలంగా వ్యవహరించినా, మీరు మాత్రం సానుకూల దృక్పథంతోనే వ్యవహరించాలి. అప్పుడే మీ ఉన్నత స్థితి స్థిరంగా ఉంటుంది. పైగా ప్రతికూలంగా వ్యవహరించేవారి పట్ల క్షమా గుణంతో ఉంటె మరింత ఉన్నతులం అవుతాం. వ్యతిరేక భవనాలు రాకుండా అదుపు చేసే శక్తి మనలోనే ఉంది' అని బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక ఉపన్యాస కురాలు, నారీశక్తి అవార్డు గ్రహీత బి కె శివాని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో మూడు రోజుల ఉపన్యాసాలకోసం వచ్చిన ఆమె శుక్రవారం అమలాపురంలో, శనివారం కాకినాడలో కార్యక్రమాల ను పూర్తిచేసుకుని ఆదివారం సాయంత్రం హుకుంపేట డీమార్ట్ పక్కన గల మైదానంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'మీ ఆనందం మీ చేతుల్లోనే ..' అంశంపై బికె శివాని దాదాపు గంటన్నర పాటు ప్రసంగం చేసారు. అమలాపురానికి చెందిన బికె స్వరూప తెలుగులోకి అనువదించారు. 'శక్తిశాలిగా, శక్తి స్వరూపంగా, శాంత స్వరూపంగా, ఆనంద స్వరూపంగా ఉండాలంటే అది మనచేతుల్లోనే ఉందని గుర్తించాలి.బాధ, కోపం, చింత, వత్తిడి వంటివన్నీ సర్వసాధారణం అనే భావనకు వచ్చేసి జీవిస్తున్నాం. ఒక వస్తువు కొనుక్కున్నా, కోరుకున్న కారు కొనుక్కున్నా, బట్టలు కొనుకున్నపుడు అది బాగుందని చెబితే ఆనందం కలుగుతుంది. ఒకవేళ ఎవరైనా బాగోలేదని చెబితే బాధ కలుగుతుంది. కోరుకున్న వస్తువులు లభించినప్పుడు ఆనందం కలుగుతుంది కానీ అది శాశ్వతం కాదు. వస్తువులు అవసరమే కానీ అవి సౌకర్యం కోసం తప్ప ఆనందం కోసం కాదని గమనించాలి. అందుకే భౌతిక వస్తువులపై కాకుండా మనలోపల ఉన్న శక్తిని గుర్తించి, దానిపై దృష్టి నిలిపితే ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ఉంటాం. దృష్టిని నుదిటి యందు నిల్పి ధ్యానం చేస్తే, మన దుఃఖానికి, మన ఆనందానికి మన భావనలే కారణమని తెలుసుకుంటాం' అని బికె శివాని తెలిపారు. ఒక మహిళ చంకలో బిడ్డను ఎత్తుకుని, నెత్తిన కుండలు పెట్టుకుని, మరో భుజంపై కూడా కుండలు పెట్టుకుని ఇరుకు సందులో నడిచి వస్తుంటే, ఎదురుగ ఏదైనా అడ్డువస్తే, అప్పుడు కుండలు పారేస్తామా, బిడ్డను పడేస్తామా అంటే కుండలు పడేసి, బిడ్డను కాపాడుకుంటామని బికె శివాని గుర్తుచేశారు. అలాగే బిడ్డలాంటి లోపల ఉన్న మనసుకి సుఖ దుఃఖాలు అంటకుండా ఉండాలంటే భౌతిక విషయాలను వదిలేయాలని ఆమె సూచించారు. మనం చేసే కర్మలే మనకు ఫలంగా వస్తాయని, తద్వారా భాగ్యరేఖ మారుతుందని ఆమె చెప్పారు. ఇంటి ముంగిట ఉన్న పూలతోటను అందరూ చూసి బాగుందని మెచ్చుకుంటారని, అయితే ఇంటివెనుక ఉన్న తోట గురించి ఎవరూ పట్టించుకోరని ఆమె ప్రస్తావిస్తూ,అలాగే రోజుకి 24గంటలూ భౌతిక విషయాలపై దృష్టి పెట్టడం వలన లోపల వున్న మనసు గురించి ఆలోచన చేయడం మానేస్తున్నామని ఆమె అన్నారు. రోజుకి కనీసం అరగంట సేపు ధ్యానం చేస్తూ, మనసులో మంచి ఆలోచనలు, మంచి భావనలు పెంపొందించుకోవాలని ఆమె అన్నారు. ఎదుటివాళ్ళు మనగురించి ఏదో అనుకుంటున్నారని వారిపట్ల ఆలోచన చేస్తూ, మనసులో ప్రతికూల భావాలు ప్రోదిచేసుకోవడం వలన అది ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని, అందుకే ఎవరు ఎలా ఉన్నా మనవరకు మనం సానుకూల దృక్పథంతోనే ఉండాలని బికె శివాని సూచించారు. మన ఇంటికి మనమే పవర్ హౌస్గా, కాలుష్యాన్ని పోగెట్టే యంత్రంగా ఉండాలని, ఎదుటివారు ఎంత చెడ్డగా ఉన్నా సరే,



క్షమాగుణంతో ఉంటూ వారిలో మార్పు రావాలని కోరుకోవాలని అప్పుడు మరింత శక్తివంతులం అవుతామని బికె శివాని సూచించారు. ఎదుటివారిని వేలెత్తి చూపడం కాకుండా మనకు మనం ప్రశ్నించుకోవాలన్నారు. ఎదుటివాళ్ళ మాదిరిగా మనం అలోచించి మన శక్తిని తక్కువ చేసుకోవడం వలన మనకే నష్టమని గుర్తించాలని సోదాహరణంగా ఆమె వివరించారు. ఈసందర్భంగా ఒక నిమిషం ధ్యానం చేయించారు. ప్రశ్నలు వేసి చేతులు ఎత్తడం ద్వారా సమాధానాలు రాబట్టారు. తొలుత సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ కెవివి సత్యనారాయణ రాజు, జి ఎస్ ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, జిఎస్ ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డా గన్ని భాస్కరరావు,సర్వశ్రీ మంతెన కేశవరాజు, రంకిరెడ్డి సుబ్బరాజు, హర్ష హాస్పిటల్ డా అరుణ, అనుశ్రీ సత్యనారాయణ, నిమ్మలపూడి గోవింద్, మాస్టారు రాజు, తదితరులు జ్యోతి ప్రకాశనం గావించారు. అలాగే మేడపాటి షర్మిలారెడ్డి, దాసరి తమ్మన్నదొర, జెట్టి రాంబాబు, మజ్జి రాంబాబు, బుడ్డిగ రవి, మాలే విజయలక్ష్మి, పలువురు ప్రముఖులు, బ్రహ్మ కుమారీస్, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పండ్లు, డ్రై ఫ్రూట్స్ అందజేత



**కాకినాడ రూరల్ (కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** కరప గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 9వ తారీఖున ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తారు. తొమ్మిదో తారీఖున కరప గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో రాఘవ హాస్పిటల్స్ గర్భిణీ స్త్రీల కొరకు పళ్ళు డ్రై ఫ్రూట్స్ సమకూర్చారు. డీఎంహెచ్వో ఆఫీసర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి గర్భిణీ స్త్రీలకు తగిన సూచనలు చేశారు. కరప గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు రాఘవ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరప పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా. ఏంజెలిన్, డిపిహెచ్ఎన్, పీఎం ఎస్ఎంఏ నరేష్ గారు, హెచ్ ఎస్ రాజగోపాలరావు, పి హెచ్ ఎం సత్యనారాయణ, పి ఎం పి డాక్టర్ శ్రీనివాస్, రాఘవ హాస్పిటల్ నగేష్, మరియు మంచాల శ్రీనివాస్, జెల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా

# డ్రోన్ ద్వారా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసిన ఎస్ఐ శ్రీరాంకుమార్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు స్మార్ట్ పోలీసింగ్‌లో నార్త్ జోన్ డి.ఎస్.పి వై.శ్రీకాంత్ మరియు కోరుకొండ సి.ఐ ఎస్.వి.వి.స్ మూర్తి యొక్క పర్యవేక్షణలో సీతానగరం ఎస్.ఐ డి.రామ్ కుమార్ వారి సిబ్బందితో పాటు రఘుదేవపురం గ్రామం నందు రోడ్ పని జరుగుచున్న ప్రదేశం నందు డ్రోన్ పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ ప్రజలకు మరియు పబ్లిక్ ట్రాన్స్పోర్టుకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ ను క్లియర్ చేయడం జరిగింది. అదే క్రమంలో ట్రాఫిక్ నియమాలు అతిక్రమించిన వారినిడ్రోన్ వ్యూ ద్వారా ముందుగా గుర్తించి అటువంటి వాహనదారులకు చలనాలు వెయ్యడం జరిగింది.

### కూటమి ప్రభుత్వం అందిస్తున్న

# సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరించాలి

### మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు

### శరభవరం గ్రామంలో గ్రామ కమిటీలకు దిశా నిర్దేశం



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు దేవీపట్నం మండల శరభవరం గ్రామం లో గ్రామ కమిటీ అధ్యక్షులు చిక్కాల భూరయ్య, కార్యదర్శి జోగి చిన్న కాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో శరభవరం గ్రామం లో ప్రతి కార్యకర్త రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని పని చేయాలని మండలంలో ప్రతి పంచాయతీలో వార్డు మెంబర్ నుండి ప్రెసిడెంట్, ఎంపీటీసీ జడ్పిటిసిల వరకు తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని అలాగే పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తల్లికి వందనం, మహిళకు ఉచిత దీపం పథకం, శ్రీ శక్తి పథకం, వృద్ధులకు 4 వేల రూపాయల పెన్షన్, వికలాంగులకు 6000 పెన్షన్ , దీర్ఘ కాళికా వ్యాధి గ్రాస్తులకు 10000/- నుండి 15000 ఇలా ఎన్నో పథకాలు మన కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల అధ్యక్షులు ముంద్రు మధుసూదన్ రావు ఇందుకూరు పేట సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు,మార్కెటింగ్ డైరెక్టర్ జొన్నల రాంబాబు,క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ,ఐటీడీపి అధ్యక్షులు అంజిరెడ్డి, ఐటిడిపి అధ్యక్షులు కుటుంబ రెడ్డి, సీనియర్ నాయకుల రేలంగి రాంబాబు ,తెలుగు యువత ఉపాధ్యక్షులు వంశీ,పోచమ్మ గండీ సభ్యులు టైలర్ నాని,మాజీ ఎంపీటీసీ మడకం శ్రీను, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు యంద్రా ఆంజనేయులు,జొన్నల రాంబాబు, బూత్ ఇంచార్జు పాతాళ పండు,కొమరం రామకృష్ణ,చిక్కాల వీరబాబు, మహిళ సీనియర్ నాయకులు కోసు శాంత కుమారి, అడ్డాల వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ తుర్రం పెంటన్న దొర,మాజీ వార్డ్ మెంబర్ కారం బయమ్మ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

### ఎయు డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను


# యధావిధిగా కొనసాగించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఉన్నటు వంటి ఆంధ్ర యూనివర్సిటీ డిస్టన్స్ సెంటర్‌ని తిరిగి యధావిధిగా కొనసాగించాలని కోరుతూ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎ.ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రాజా మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీలో డిస్టన్స్‌లో చదివే విద్యార్థులు నిన్న క్లాసులకు వెళ్లగా, ఇక్క డ ఉన్న స్టాఫ్ అందరినీ వైజాగ్ ట్రాన్ఫర్ చేశారని కొత్తగా ఎవరిని ఇక్కడికి అలాట్ చేయలేదని, విద్యార్థుల కొరకు సపోర్టింగ్ స్టాఫ్ ఎవరు లేరని చెప్పారు. దీంతో డిస్టన్స్ ఎడ్యుకేషన్ విద్యార్థుల కొరకు ప్రత్యేకమైన విభాగం లేకుండా, ఈ దూర ప్రాంత విద్యార్థుల బాధ్యత కూడా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అప్పజెప్పడం వలన ఆదివారం క్లాసులకు వచ్చే, డిస్టన్స్ ఎడ్యుకేషన్ ఉపయోగించుకుని చదివే విద్యార్థులకు ఎంతో అవరోధం, ఇబ్బంది కలుగుతుందని అన్నారు. దూర విద్య విద్యార్థుల కొరకు ఒక ప్రత్యేక విభాగము మరియు డెడికేటెడ్ స్టాఫ్ ఉండటం వలన ఆదివార క్లాసులకు అటెండ్ అయ్యి ఉన్నత చదువులు చదువుకోవాలని ఉన్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 2025, 2026 సంవత్సరంలో 400 కు పైగా విద్యార్థులు ఈ సెంటర్ ద్వారా అడ్మిషన్ తీసుకున్నారని ఇప్పుడు సడన్ గా ఈ హెల్ప్ సెంటర్ మూసివేయడం వల్ల కొన్ని వందల మంది విద్యార్థులు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుని చదువుకుందామనే మహిళలకు, గృహిణులకు ఈ హెల్ప్ సెంటర్ వలన మరియు డెడికేటెడ్ స్టాఫ్ వలన స్టడీ కి సంబంధించిన ప్రతి సమస్యను ఈ దూర విద్య సెంటర్ ద్వారా ఇక్కడే పరిస్కారం చేసుకుంటున్నారు. ఈ సెంటర్ తీసేయడం గురించి విద్యార్థులు ఎవరికి ఇన్ఫర్మేషన్ లేదు. దూర విద్యార్థులకు సండే క్లాసెస్ సవ్యంగా జరగాలని సంబంధించిన సమస్యలను, అసైన్మెంట్ సబ్మిట్ చేయడానికి, ఆన్లైన్ లాగిన్ రిలేటెడ్ ఇష్యూ సాల్వ్ చేయడానికి టికెట్స్ సంబంధించిన ఏ సమస్యనైనా సాల్వ్ చేయడానికి మార్క్ లిస్టులు తీసుకోవడానికి ఎమైనా ట్యూషన్ ఫీజు రిలేటెడ్ సమస్యలు తీర్చడం కోసం మరియు విద్యార్థులకు వచ్చిన ఏ సమస్య అయినా ఈ స్టడీ సెంటర్ ద్వారా పరిష్కారానికి ఉపయోగపడుతుంది. ఇప్పుడు ఉన్నటువంటి సెంటర్ ఎన్నో దశాబ్దాలుగా కొన్ని వేల మందికి ఉన్నత విద్యకు దోహదపడిన ఈ సెంటర్ ను అకస్మాత్తుగా మూసి వేయడం వలన కొన్ని వందల మంది విద్యార్థుల భవిత అగమ్య గోచరంగా తయారైంది. కనుక ఈ డిస్టెన్స్ సెంటర్ ను మూసివేయాలనుకునే నిర్ణయాన్ని వెనుకకు తీసుకుని గ్రామీణ ప్రాంత, విద్యార్థుల విద్యా కలలను సాకారం చేస్తారని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు ఎస్.కనక, శివబాలాజీ, మౌళి, తేజ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంద్రకీలాద్రిపై వేద పండితుల

# ఆశీస్సులు తీసుకున్న బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి సమేత స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని రుడా చైర్మన్ తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సందర్శించి అమ్మవారిని దర్శించుకుని వేద పండితులు ఆశీస్సులు తీసుకున్నారు.

### అంగన్వాడి టీచర్లు ఆయాల సమస్యలు

# త్వరితగతిని పరిష్కరిస్తా : ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం లో అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాజానగరం నియోజకవర్గ అంగన్వాడి టీచర్లు, ఆయాలు నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సమస్యలపై బత్తుల బలరామకృష్ణ వెంటనే స్పందించి త్వరితగతిన వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# ఆహార పధార్ధాలు విద్యార్థులకు అందించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్, కుక్ సస్పెండ్

### జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ - విధులలో అలసత్వం వహించిన ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావుకు షోకాజ్ నోటీసు




**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మారేడుమిల్లి మండలం దేవరపల్లి బాలురు ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు ఆహార పదార్థాలు తయారుచేసి విద్యార్థులకు అందించడంలో నిర్లక్ష్యం వహించిన డిప్యూటీ వార్డెన్ కె.గణపతిని, కుక్ పి. లక్ష్మిని విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి,పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ శనివారం మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు శనివారం మధ్యాహ్నం ఆహార పదార్థాలు తిన్న తర్వాత కడుపునొప్పి, వాంతులు విరోచనాలతో బాధపడుతున్న వారిని హుటాహుటిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్య సేవల కొరకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.ఆదివారం 62 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉండడం తో ఆసుపత్రి నుండి డిఛార్జీ చేయడం జరిగిందని అదేవిధంగా 9వ తేదీ సోమవారం పూర్తిస్థాయిలో ఆరోగ్యం గా ఉన్నవారిని అందరినీ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో డీఎం అండ్ హెచ్ ఓ పి. సరిత ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకుగాను డిప్యూటీ వార్డెన్ కె. గణపతిని, కుక్ పి. లక్ష్మిని సస్పెండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి జె. శంభుడు పరివేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు సోకజ్ నోటీసు అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు డి.నాగేశ్వరరావును విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు శనివారం సాయంకాలం సోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థులందరూ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారని జాయింట్ కలెక్టర్ తెలిపారు.








## సామాన్య మానవుడి జీవితం

# అష్టకష్టాలమయం





**ఆదాయం లేని విధానం..అధిక ఖర్చులకు కుటుంబం పోషణ సులభం కాదు.. - ఇదే నేటి సమాజ నినాదం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం :**

ఆదాయం సరిపోక.. నిత్యావసరాలు కూడా సమాకుర్చుకోలేక.. పెరుగుతున్న ధరలను తట్టుకోలేక..సామాన్య కుటుంబాలు ఎదురుకుంటున్న సమస్యల సారం ఈ కథనం.

నేటి సమాజంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వారి జీవితం అష్టకష్టాలమయం అయిపోయింది. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ప్రతి క్షణం ఖర్చుతోనే ముడిపడి ఉంది. నిత్యావసరాలు సమకూర్చుకోవడానికి వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయ మార్గాలు తక్కువగా ఉండటం, పెరిగే ధరలు ఎక్కువగా ఉండటం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సగటున ఒక కుటుంబం బ్రతకాలంటే తక్కువలో తక్కువ 25 -30 వేల రూపాయలు అవసరం అవుతున్నాయి. ఇక విద్య, వైద్యం అంటే వారికి సాధ్యం కావడం లేదు. వారు తమ పిల్లలకు మంచి చదువు చెప్పించలేక, మంచి భవిష్యత్తు కల్పించలేక నిరాశకు గురవుతున్నారు. ప్రవేటు ఉద్యోగాలలో పని ఒత్తిడి ఎక్కువగా ఉండటం, జీతం తక్కువగా ఉండటం వల్ల వారు సంతోషంగా జీవించలేకపోతున్నారు. ఒక సినిమాకు వెళ్లడం, కుటుంబంతో షికారు చేయడం అనే ఆలోచన కూడా వారికి భయం కలిగిస్తుంది. పెరిగే ధరలు, తగ్గని ఖర్చులు వారిని నానాటికి కృశింపజేస్తున్నాయి. వారి ఆదాయం పెరగడం లేదు, కానీ ఖర్చులు మాత్రం పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి నుండి బయటపడడం వారికి సాధ్యం కావడం లేదు. వారు ప్రతి రోజు భయంతో, ఆందోళనతో జీవిస్తున్నారు. వారి జీవితంలో సుఖం, శాంతి లేవు. ఈ సామాన్య మధ్యతరగతి కుటుంబాల కోసం ఆలోచించే వారు ఎటువంటి ప్రయత్నం చేయడం లేదు. వారి కోసం ఏదైనా చేయాలి అనే భావన ప్రభుత్వం మరియు సమాజంలో బలపడాలి. ఈ పరిస్థితి మారాలి, సామాన్య మధ్యతరగతి కుటుంబాలు సుఖంగా జీవించాలి. వారికి మెరుగైన భవిష్యత్తు కల్పించాలి. అని ప్రభుత్వానికి, అధికారులను వేడుకుంటున్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - మహిళలకు ఓఎన్జీసీ నిధులతో 100మందికి కుట్టు శిక్షణ ప్రారంభం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి, పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సమానంగా రాణిస్తున్నారని, ప్రభుత్వం కూడా మహిళల పేరుతోనే పథకాలను అమలు చేస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మహిళా పక్షపాతిగా ఉందన్నారు. ఓఎన్జీసీ రాజమమహేంద్ర వరం అసెట్ వారి సిఎస్ఆర్ నిధులతో రాజరాజేశ్వరి మహిళా సంక్షేమ సంఘం పర్యవేక్షణలో మహిళలకు టైలరింగ్ లో ఉచిత శిక్షణ, మరియు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక 13వ వార్డు తాడితోట అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 100 మందికి 100 మిషన్లతో మూడు నెలల పాటు అనుభవజ్ఞులతో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఒక్కొక్కరికీ ట్రెనింగ్ కిట్టు కింద మిషన్‌కు సంబంధించిన సూది, కత్తెర, దారాలు తదితర సామాగ్రితో పాటు ట్రెనింగ్ బుక్స్ కూడా అందజేస్తారని తెలిపారు. మరో 200 మందికి శిక్షణ ఇప్పించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇప్పుడు ఒక యూనిట్ తెచ్చామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెండు యూనిట్ లు తెస్తామని ఎమ్మెల్యే వాసు ప్రకటించారు. డ్వాక్రా సంఘాలు ముఖ్యమంత్రి చంద్రబాబు మానస పుత్రికలని అన్నారు. పైగా తన విజయంలో మహిళల పాత్ర మరువలేనిదని అన్నారు. అందుకే మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడి కుటుంబానికి సహాయకారిగా ఉండడానికి ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తామని తెలపారు. గత వైసిపి ప్రభుత్వంలో పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచుతామని చెప్పి ఐదేళ్లలో పెంచారని, అదే కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే రూ 1000లు పెంచడమే కాకుండా ఇస్తామన్న బకాయిలు కూడా ఇచ్చామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. సి ఎస్ ఆర్ నిధులను వీలైనంత రాబట్టాలని ప్రయత్నం చేస్తూ గడిచిన 20నెలల్లో రూ 7కోట్లకు పైగా సి ఎస్ ఆర్ నిధులు తెచ్చామని ఆయన అన్నారు. మరి గత ప్రభుత్వంలో ఇలా ఎందుకు తేలకపోయారని ఆయన ప్రశ్నించారు. ఇళ్లకు సూట్ కేసులు రప్పించుకుని జేబులు నింపేసుకునే సంస్కృతి కూటమి ప్రభుత్వంలో లేదని ఆయన స్పష్టంచేసారు. రాజరాజేశ్వరి మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు, పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కృషితో ఓఎన్ జిసి సిఎస్సార్ నిధుల ద్వారా 100కుట్టు మిషన్లు తీసుకొచ్చారని తెలిపారు. మూడు నెలల పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ 50 మంది ఒక బ్యాచ్ మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ, మరో 50 మంది ఇంకో బ్యాచ్ గా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయ్యాక, మిషన్, కిట్ ఉచితంగా అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారిత కోసం కృషిచేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారిత కోసం ఎన్నో కార్యక్రమాలు చేసారని, అలాగే ఎమ్మెల్యే వాసు సిఎస్సార్ నిధుల ద్వారా 100కుట్టుమిషన్స్ తీసుకు వచ్చి, 100కుటుంబాలకు చేయూతనిచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. 2009లో తమ సంఘం ఏర్పడిందని, 2019లో వైసిపి ప్రభుత్వంలో ఓఎన్ జేసి వారి ద్వారా సిఎస్సార్ నిధులు తమ సంఘానికి రాకుండా అడ్డుకున్నారని మాలే విజయలక్ష్మి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వాసు కృషి మేరకు నిధులు వచ్చాయని కృతజ్ఞతలు తెలిపారు. నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు, మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ మాట్లాడుతూ ఓఎన్ జిసి సిఎస్సార్ నిధుల ద్వారా 13వ వార్డు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో కుట్టు శిక్షణ ప్రారంభించుకోవడం ఆనందదాయకమని అన్నారు. ప్రభుత్వ పథకాలు మహిళలకు ఉద్దేశించి ఎన్నో ఉన్నాయని, వాటిలో అర్హతలేనివారికి ఎమ్మెల్యే వాసు ఈవిధంగా చేయూతనివ్వడం అభినందనీయం అన్నారు. 13వ డివిజన్ ఇంచార్జ్ కప్పల వెలుగు కుమారి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు సంబంధించి 100మందికి ఈవిధంగా టైలరింగ్ లో ఉచిత శిక్షణ ఇచ్చి, మిషన్ ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించి, మాలే విజయలక్ష్మి సారధ్యంలో ఈ కార్యక్రమాన్ని తలపెట్టడం పట్ల హర్షం వ్యక్తంచేసారు. ఈ శిక్షణను వినియోగించుకుని, టైలరింగ్ వృత్తిలో రాణిస్తూ, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కాశీ నవీన్ కుమార్, పీఎంకే సత్రం చైర్మన్ రెడ్డి మణి, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, ఛాంబర్ పూర్వాధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, ద్వారా పార్వతి సుందరి, అప్సరి, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ తురకల నిర్మల, చింతా జోగినాయుడు, శనపతి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు - ఒక రోజు దీక్ష చేపట్టిన టీ.కే విశ్వేశ్వరరెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు..రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్,అన్ ఎయిడెడ్ కళాశాలలకు ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు చెల్లించాలని ఏపీ ఎఫిలియేటెడ్ ప్రైవేట్ అండ్ అన్ ఎయిడెడ్ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ గౌరవ సలహాదారు, రాజమహేంద్రి మహిళా కళాశాలల చైర్మన్ టీకే విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కళాశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి దీక్షలో కూర్చుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు వెంటనే చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ 6500 కోట్లు, జిల్లా వ్యాప్తంగా 250 కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు 9 వాయిదాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని చెప్పారు.అవి చెల్లించలేక పోవడం వల్ల విద్యార్థులకు యూనివర్సిటీ నుంచి డిగ్రీ సర్టిఫికెట్లు మంజూరు కావడం లేదని, ఈ పరిస్థితి వల్ల ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్ కు వెళ్లే విద్యార్థులు, ఇతర ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 1130 కళాశాలు, జిల్లాలో 234 కళాశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్మెంట్ కోసం చర్యలు తీసుకోకుంటే అమరావతి లో సచివాలయం ఎదుట వేలాది విద్యార్థులతో నిరసన చేపడతామని, అప్పుడు కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించక సైతం వెనుకాడబోమని అన్నారు. అదే జరిగితే చంద్రబాబు ప్రభుత్వానికి అది మాయని మచ్చగా మిగిలిపోతుందని ఆక్షేపించారు. ఇటీవల రాజమండ్రిలో విద్యా శాఖ మంత్రి లోకేశ్ ను కలిసినపుడు డిసెంబర్‌లో ఫీజు రీయింబర్స్మెంట్ బాకాయిలు వేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.ఈ విషయంలో లోకేష్ తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలో రాజమహేంద్రి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య, ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్.ప్రసాద్, ఎ.ఒ.రామిరెడ్డి, వెంకట్ తదితరులు కూర్చున్నారు. ఈ దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ పిసిసి ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, రాజమండ్రి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, రాష్ట్ర కిసాన్ సెల్ చైర్మన్ హరిబాబు, రాజానగరం నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వడయార్, జిల్లా జనరల్ సెక్రెటరీ నల్ల వీర్రాజు, రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఇవాళ వీరభద్రరావు, రాజీవ్ గాంధీ కళాశాల లెక్చరర్లు, డైరెక్టర్ కరుకూరి శైలజ, కాలేజీల యాజమాన్య మిత్రులందరు వచ్చి తదితరులు వచ్చి ఫీజు రీయింబర్స్మెంట్ పై డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించే వరకు ఉద్యమానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# 8వ వార్డులో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట 8వ వార్డు పరిధిలో పలు కూడళ్లలో కొత్తగా 10 కరెంట్ సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. మండపేట మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బందితో ఈ స్తంభాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ బాబు జగజీవన్ రామ్ పార్కు, దార్ల అబ్రహం ఇంటి వద్ద, ఎస్సీ స్మశాన వాటిక, దేవాంగుల స్మశాన వాటిక, నురుకుర్తి లక్ష్మి, పలుచోట్ల కరెంట సిమెంట్ స్తంభాలు వేసినట్లు మందపల్లి రవికుమార్ పేర్కొన్నారు.

# జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత కళ్ళజోడు పంపిణీ

**ప్రిన్సిపల్ కృష్ణ కిషోర్**




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 13 మంది విద్యార్థులకు ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ డి కృష్ణ కిషోర్ తెలిపారు. జాతీయ అందత్వ నివారణ సంస్థ 0.2 కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా సుమారు 13మంది విద్యార్థులకు కళ్లద్దాలు పడ్డాయన్నారు. సోమవారం రాజబాబు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోడు అందిస్తుందన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, చదువులలో చక్కగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా**

# బుడ్డిగ వెంకటరమణి ప్రమాణ స్వీకార మహోత్సవం

**- అభిమానుల మధ్య భారీ ర్యాలీ**

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపిన బుడ్డిగ రవి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో స్థానిక 38వ డివిజన్ టీడీపీ ఇంచార్జి బుడ్డిగ రవి సతీమణి బుడ్డిగ వెంకటరమణి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ తూర్పు గోదావరి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గా నియమితులైన సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన 38,40 డివిజన్ల టీడీపీ శ్రేణులు. ఆదివారం ఉదయం చెరుకూరి ఫంక్షన్లో జరిగే తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరవుతున్న బుడ్డిగ వెంకట రమణికి సీతంపేట లో వారి నివాసం వద్ద రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకర్రావు, టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, క్రెడై రాష్ట్ర అధ్యక్షులు బుడ్డిగ శ్రీనివాస్, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్లు యెనుముల రంగబాబు, పడాల శ్రీనివాస్, యర్రమోతు ధర్మరాజు, ముగిడి శ్రీనివాస్, దొండపాటి సత్యంబాబు, మాలే విజయలక్ష్మి, మజ్జి పద్మ, 34వ డివిజన్ కేలం శ్రీనివాస్, 35 వ డివిజన్ కరగాని వేణు, 36వ డివిజన్ తంగెళ్ల బాబీ, 37వ డివిజన్ ఉర్లంకల లోకేష్, 38వ డివిజన్ యూనిట్ ఇంచార్జి బుడ్డిగ గోపాలకృష్ణ, 40వ డివిజన్ కొల్లి నాని, 42వ డివిజన్ మళ్ళ వెంకట రాజు తదితరులు ఆమెను కలిసి అభినందనలు తెలియచేశారు. అనంతరం బుడ్డిగ వెంకట రమణి ఆమె భర్త బుడ్డిగ రవితో కలసి ప్రమాణస్వీకారం కార్యక్రమంనకు ర్యాలీగా తరలివెళ్లారు.

# రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థులకు వీసీ అభినందనలు



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధానిలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కవాతు చేసి,రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ వంటి ప్రముఖుల మన్ననలు పొందిన ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ విద్యార్థులు ఎం. హరిప్రియ, కె.వినయ్ లను వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ అభినందించారు. సోమవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీని కలిసిన విద్యార్థులు గణతంత్ర దినోత్సవ వేడుకల విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిప్రియ, వినయ్ లను వీసీ శాలువాతో సన్మానించి అభినందించి వివరాలు తెలియజేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్. విభాగం తరపున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలైన రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కాలేజ్ నుండి ఎం హరిప్రియ, రావులపాలెం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నుండి కె వినయ్ లు రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ కు ఎంపికై చక్కని ప్రతిభ కనపరిచారని అన్నారు. తొలి దశలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రీ రిపబ్లిక్ డే క్యాంపు సెలక్షన్స్ నిర్వహించి దానిలో ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థులను గుజరాత్ లోని హేమచంద్రచర్య యూనివర్సిటీలో పది రోజుల ప్రీ రిపబ్లిక్ డే క్యాంపుకు ఎంపిక చేశారని చెప్పారు. గుజరాత్ క్యాంపులో ప్రతిభ కనబరచిన హరిప్రియ, వినయ్ లు న్యూఢిల్లీలో నెలరోజుల రిపబ్లిక్ రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపులో పాల్గొన్నారని చెప్పారు. వివిధ దశలలో జరిగిన క్యాంప్ లలో ప్రతిభ కనపడచడంతో పాటు జనవరి 26న న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో చక్కని కవాతు చేశారని చెప్పారు. దేశ రాజధానిలో, దేశ ప్రముఖుల మధ్య ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఖ్యాతిని పెంచారని, వారి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ఎక్కువ ఎన్.ఎస్.ఎస్. యూనిట్లుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం సేవా దృక్పథంతో పని చేస్తుందని గుర్తు చేశారు. విద్యార్థులంతా ఇటువంటి వీటిని స్ఫూర్తిగా తీసుకొని ఎన్.ఎస్.ఎస్. సేవా మరియు గౌరవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.పి.వెంకటేశ్వరరావు, డీన్ ఎగ్జామినేషన్స్ ఆచార్య డి. కళ్యాణి విద్యార్థులను అభినందించారు.

# నారాయణలో డెలీబ్రేషన్ పోటీలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లలలో మాట్లాడే సామర్థ్యం పెంచడానికి ఏ జి ఏమ్ షేక్ అలీషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినా నారాయణ డెలిబ్రేషన్ పోటీలలో పిల్లలు చురుకుగా పాల్గొని ఎన్నో అంశాలపై చక్కగా మాట్లాడారు. ప్రిన్సిపాల్ శైలజ, శేషు బాబు వారి ప్రతిభను చూసి ఆశ్చర్యచకితులై పులకించిపోయారు. వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సభలు, సమావేశాల్లో చక్కగా మాట్లాడటం, సభా మర్యాద వంటి అంశాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. దీని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉద్యోగాలు, ఉపాధి కల్పన తదితర అంశాలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం ఆర్ ఎస్ టి రాధాకృష్ణ, కో ఆర్డినేటర్ గోపినాయుడు, ఏడి వీరేంద్రనాథ్, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ దివ్య పిల్లలకు సర్టిఫికెట్స్, ప్రథమ, ద్వితీయ, తృతీయ మెడల్స్ అందజేసి అభినందించారు.

సినీ వాయిస్ CINEMA



# ఎర్రటి చీరలో ముద్దుగుమ్మలా..

## పూజ బ్యూటిఫుల్ ఫొటోస్

అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా రెడ్ కలర్ చీరలో ఉన్న ఫొటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. హీరోయిన్ పూజా హెగ్డే గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు ఒకప్పుడు వరస సినిమాలు, స్పెషల్ సాంగ్స్‌తో సందడి చేసిన ఈ చిన్నది. ఈ మధ్య కాస్త సైలెంట్ అయ్యిందనే చెప్పాలి. గతంతో పోలిస్తే ప్రస్తుతం ముద్దుగుమ్మకు సినిమా అవకాశాలు చాలా వరకు తగ్గిపోయాయి. ప్రస్తుతం ఈ నటి కోలీవుడ్ హీరో విజయ్ దళపతి సరస జననాయగన్ మూవీ లో నటిస్తుంది. ఒక లైలా సినిమాతో తెలుగు వెండి తెరకు పరిచయమైన ముద్దుగుమ్మ పూజా. ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదిం చుకుంది. తన నటన, అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టు కుంది. సిని మాలు ఫ్లాప్ అయిన ప్పటికీ, ఈ అమ్మడుకు మాత్రం మంచి అవకాశాలే వచ్చాయి. ఈ సినిమా తర్వాత ఈ బ్యూటీ చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంది. అల్లు అర్జున్ సరసన దువ్వాడ జగన్నాథం, అరవింద సమేత, మహర్షి, అలా వైకుంఠ పురం , రాధే శ్యామ్, ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. టాలీవుడ్ స్టార్ హీరోల అందరి సరసన నటించింది. సంక్రాంతికి ఈ చిన్నది జననాయగన్ మూవీతో అభిమానులను పలకరించనుంది. దీంతో ఈ మూవీ ప్రమోషన్స్ లో పాల్గొన్ని ముద్దుగుమ్మ రెడ్ కలర్ చీరలో మెరిసిపోయింది. అదరిపోయే లుక్‌లో తన క్యూట్ నెస్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ఆ టైంలో చచ్చిపోయా అనుకున్నా..

## తలుచుకుంటే ఇప్పటికీ వణుకు పుడుతుందంటున్న హీరోయిన్



టాలీవుడ్ హీరోయిన్ చాందిని చౌదరి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. షార్ట్ ఫిల్మ్స్ తో కెరీర్ ప్రారంభించిన ఈ అందాల తార ఇప్పుడు క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. కలర్ ఫొటో సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ఇటీవలే సంతాన ప్రాప్తిరస్తు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.. తెలుగు అమ్మాయిలు ప్రస్తుతం వరుసగా సినిమా అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. వారిలో చాందిని చౌదరి ఒకరు. షార్ట్ ఫిలిమ్స్ నుంచి హీరోయిన్ గా ఎదిగింది చాందిని. హీరోయిన్ గా కెరీర్ మొదలు పెట్టి అలాగే సహాయక పాత్రల్లోనూ మెప్పిస్తూ రాణిస్తుంది చాందిని చౌదరి. ఇటీవలే సంతాన ప్రాప్తిరస్తూ అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఈ ముద్దుగుమ్మ హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తుంది ఈ చిన్నది. కాగా ఓ ఇంటర్వ్యూలో చాందిని మాట్లాడుతూ షాకింగ్ విషయాలు బయట పెట్టింది. ఓ సినిమా షూటింగ్ లో భయంకరమైన సంఘటనలు జరిగాయి అని తెలిపింది. ఓ ఇంటర్వ్యూలో చాందిని చౌదరి మాట్లాడుతూ.. విశ్వక్ సేన్ హీరోగా నటించిన గామి షూటింగ్‌లో ఎదుర్కొన్న రెండు భయానక సంఘటనలను పంచుకుంది. హిమాలయాల అద్భుతమైన నేపథ్యంలో చిత్రీకరించిన ఈ చిత్రంలో చాందిని చౌదరి కీలక పాత్రలో నటించింది. ఆ సినిమా షూటింగ్ లో జరిగిన కొన్ని సన్నివేశాలు ఆమెకు జీవితాంతం గుర్తుండిపోతాయని చెప్పుకొచ్చింది. మొదటి సంఘటన డ్రోన్ షాట్ చిత్రీకరణ సమయంలో జరిగిందట. విశ్వక్‌తో కలిసి చాందిని ఒక పర్వతాన్ని ఎక్కవలసి వచ్చింది. ఆ పర్వతాన్ని ఎక్కే రూట్ చాలా టఫ్.. అది ఎక్కే సీన్ లో విశ్వక్ ఎలాంటి లాగేజ్ లేకుండా ఒక్కడే పైకి ఎక్కేవాడు.. కానీ నాకు ఓ మాత్రం బరువైన బ్యాగ్ అంటగట్టారు. దాదాపు 45 నుండి 60 డిగ్రీల వాలు ఉన్న ఆ నిటారు మార్గంలో ఆ బ్యాగ్‌తో ఎక్కడం తనకు సవాలుగా మారిందని చెప్పింది. నేను పైకి ఎక్కుతుంటే ఆ బ్యాగ్ నన్ను వెనక్కి లాగుతోంది. ఒక సమయంలో నేను వెనక్కి పడిపోబోయాను. అప్పుడు బ్యాగ్‌ను వదిలేశాను. అది దొర్లుకుంటూ కిందకు వెళ్లిపోయింది చెప్పింది. ఆ తర్వాత ఆమె మళ్లీ కిందకు వెళ్లి బ్యాగ్‌ను తెచ్చి, ఎంతో కష్టపడి ఆ పర్వతాన్ని ఎక్కి డ్రోన్ షాట్‌ను పూర్తి చేసిందట. ఎంత సమయం పట్టిందో కూడా తనకు గుర్తు లేదని చెప్పుకొచ్చింది. రెండవ సంఘటన, అంతకుమించి భయంకరమైనది, గడ్డకట్టిన సరస్సుపై జరిగింది. అదొక ఎక్స్‌పెడిషన్స్ జరిగే ప్రాంతం. వెళ్లే సమయానికి సరస్సు పూర్తిగా గడ్డకట్టుకుపోయింది. డ్రోన్ షాట్స్ కోసం సరస్సుపై ఒంటరిగా నడుస్తూ వెళ్లాలి. ముందుగా, సినిమా టీమ్ కొంత దూరం వరకు మంచు బలంగా ఉందని చెక్ చేశారు,దాంతో తనను దాని పై వెళ్ళమని చెప్పారు. అయితే, అది షూట్ చేసే సమయంలో.. ఇద్దరు కెమెరామెన్‌లు కెమెరాలతో పాటు ఉన్నారట, పైన డ్రోన్ కూడా ఉంది. అయితే చాందిని నడుస్తూ వెళ్తుండగా, అకస్మాత్తుగా మంచు పగులుతున్న శబ్దం వినిపించిందట. నేను లోపలికి వెళ్తే, ఆ ప్రవాహంలో కొట్టుకుపోతాను. పైకి రావడం అసాధ్యం, అంతా అయిపోయినట్లే అని ఆ క్షణాలను గుర్తుచేసుకుంటూ చేసుకుంది చాందిని. అప్పుడు అందరూ ఒక్కసారిగా నిశ్శబ్దంగా, బిగుసుకుపోయి చూశారు. ఆమె కదల్లేని పరిస్థితిలో ఉండిపోయింది, కదిలితే మంచు పూర్తిగా పగిలిపోతుందని భయం. ఏం చేయాలో తెలియని ఆ క్షణంలో, కొంచెం స్పేస్ ఇవ్వండి, నేను దూకడానికి ప్రయత్నిస్తాను అని చెప్పి, మొదట బ్యాగ్‌ను విసిరివేసిందట. ఆ తర్వాత గట్టిగా ఊపిరి పీల్చుకుని, ఒక్కసారిగా దూకి, అదృష్టవశాత్తు బయటపడ్డా.. నేను నిలబడిన చోట సరిగ్గా ఒక పెద్ద రంధ్రం ఏర్పడిందని చెప్పుకొచ్చింది. ఆ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడటం నిజంగా ఒక అద్భుతమని, దాని గురించి చెప్పేటప్పుడు కూడా తనకు వణుకు పుడుతుందని చాందిని చౌదరి చెప్పుకొచ్చింది. ఇది తన జీవితంలో ఎదురైన అత్యంత భయంకరమైన అనుభవమని ఆమె తెలిపింది.

క్రీడా వాయిస్

# ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా కాదు రా భయ్..

## టీ20 ప్రపంచకప్ హిస్టరీలోనే తొలి టీంగా భారత్.. ఫస్ట్ మ్యాచ్‌తోనే ప్రపంచ రికార్డ్



టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా తన తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడిన సంగతి తెలిసిందే. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో సూర్యసారథ్యంలోని భారత జట్టు 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలవడమే కాకుండా ఓ ప్రపంచ రికార్డును కూడా సృష్టించింది. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ జట్టు సాధించని ఘనతను తన ఖాతాలో వేసుకుంది.గత టీ20 ప్రపంచ కప్ ఎడిషన్‌లో రోహిత్ సేన సారథ్యంలోని భారత జట్టు వరుసగా ఎనిమిది మ్యాచ్‌లను గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లోని తొలి మ్యాచ్‌లోనే అమెరికాను ఓడించడం ద్వారా భారత జట్టు టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా తొమ్మిదవ విజయాన్ని సాధించింది. ఈ అద్భుతమైన ప్రదర్శనతో, టీ20 ప్రపంచ కప్ చరిత్రలో వరుసగా అత్యధిక విజయాలు సాధించిన రికార్డును భారత్ నెలకొల్పింది. ఈ విజయానికి ముందు, భారత జట్టు వరుసగా ఎనిమిది విజయాలు సాధించిన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాతో మొదటి స్థానంలో ఉంది. తాజా గెలుపుతో ఈ రెండు జట్లను భారత్ బీట్ చేసింది. ఈ విజయం భారత జట్టుకు మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే, మ్యాచ్ పేలవంగా ప్రారంభమైంది. 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అజేయంగా 84 పరుగులతో భారత జట్టును 161 పరుగులకు చేర్చాడు. ఛేజింగ్ లో అమెరికాను 132 పరుగులకే పరిమితం చేసింది. దీంతో 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ తప్ప, మరే ఇతర భారత బ్యాటర్ కూడా 30 పరుగులకు చేరుకోలేకపోయాడు. ఇది టోర్నమెంట్ ప్రారంభంలో జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. టోర్నమెంట్‌లో భారత బ్యాటింగ్ ఆర్డర్ అత్యంత బలమైన జట్టుగా పేరుగాంచింది. కానీ అమెరికా వంటి జట్టుతో జరిగిన మొదటి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. టీమిండియా గ్రూప్‌లో అమెరికా, పాకిస్తాన్, నమీబియా, నెదర్లాండ్స్ ఉన్నాయి. భారత జట్టు తదుపరి మ్యాచ్ నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 12న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతుంది. ఆ తర్వాత, భారత జట్టు కొలంబోకు వెళ్లి పాకిస్తాన్‌తో తలపడుతుంది. చివరగా ఫిబ్రవరి 18న నరేంద్ర మోడీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

# టీమిండియాకు మరో బిగ్‌షాక్..

## నమీబియాతో మ్యాచ్ నుంచి అభిషేక్ ఔట్.. కారణం ఏంటంటే?




టీమిండియా తన నెక్ట్స్ మ్యాచ్‌ను నమీబియాతో ఆడనుంది. ఇప్పటికే అమెరికాపై విజయం సాధించిన భారత జట్టు.. మరో విజయంపై కన్నేసింది. అయితే, భారత జట్టు ఓపెనర్ అభిషేక్ శర్మ రెండో మ్యాచ్ ఆడడంపై అనుమానాలు వస్తున్నాయి. అందుకు గల కారణం ఓసారి చూద్దాం.. టీ20 ప్రపంచకప్ 2026 సందడి గ్రాండ్ గా మొదలైంది. అయితే, గాయాలతో చాలా జట్లు ఇబ్బంది పడుతున్నాయి. ఆస్ట్రేలియా జట్టు ఎక్కువగా ఇబ్బంది పడింది. మరోవైపు టీమిండియా కూడా ఈ గాయాలా ఎఫెక్ట్ ను ఎదుర్కొంటుంది. ఇప్పటికే వాషింగ్టన్ సుందర్, తిలక వర్మ ఇబ్బంది పడిన సంగతి తెలిసిందే. బుమ్రా కూడా అనారోగ్యంతో ఇబ్బంది పడ్డాడు. తాజాగా ఈ లిస్ట్ లో టీమిండియా డేంజరస్ ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా చేరినట్లు తెలుస్తోంది. అందుకు గల కారణం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. అయితే, అభిషేక్ శర్మ అనారోగ్యం టీమిండియాకు ఇబ్బందిగానే ఉండొచ్చు. అమెరికా జట్టు బ్యాటింగ్ చేసే సమయంలో ఈ యంగ్ డైనమేట్ మైదానంలోకి దిగలేదు. అభిషేక్ స్థానంలో శాంసన్ ఫీల్డింగ్ చేస్తూ కనిపించాడు. అంతకుముందు అభిషేక్ తొలి బంతికే డకౌట్ అయిన సంగతి తెలిసిందే. అయితే, టీమిండియా తదుపరి మ్యాచ్ గురువారం ఢిల్లీలో నమీబియాతో జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆదివారం సాయంత్రం తన నివాసంలో జట్టుకు విందు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ విందు కోసం ఆటగాళ్లు అంతా వచ్చారు. కానీ, అభిషేక్ శర్మ మాత్రం అందరికంటే ముందుగానే తిరుగుప్రయాణం అయ్యాడు. చాలా మంది సిబ్బంది ఈ యంగ్ గన్ కు వీడ్కోలు పలికేందుకు వచ్చినట్లు వీడియోలో చూడొచ్చు. ఈ క్రమంలో నమీబియాతో జరిగే తదుపరి మ్యాచ్‌కు అభిషేక్ శర్మ అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీ20 ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో అమెరికాను ఓడించే ఫేవరెట్‌గా టీమిండియా బరిలోకి దిగింది. కానీ, అమెరికా జట్టు గట్టి పోటీ ఇవ్వడంతో టీమిండియా కష్టపడి గెలవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ తర్వాత, మహమ్మద్ సిరాజ్ విలేకరుల సమావేశంలో పాల్గొని అభిషేక్ తీవ్రమైన జ్వరం, కడుపు నొప్పితో ఆట ఆడాడని వెల్లడించాడు. "అభిషేక్ శర్మకు కడుపు నొప్పిగా ఉంది. అందుకే అతను ఫీల్డింగ్ చేయలేదు" అని సిరాజ్ చెప్పుకొచ్చాడు. ఇప్పటికే జస్ప్రీత్ బుమ్రా కూడా జ్వరం కారణంగా అమెరికాతో జరిగిన మ్యాచ్‌కు దూరమైన సంగతి తెలిసిందే. గురువారం నమీబియాతో జరిగే మ్యాచ్‌కు ఆయన దూరమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్


VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com